




# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక






సంపుటి: 4 సంచిక: 336, పేజీలు - 08
మంగళవారం, ఏప్రిల్ 29, 2025 వెల: 5 రూ/.
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati



# కేసీఆర్‌ది అంతా అక్కసే

## - సీఎం రేవంత్ చిట్ చాట్

- కేసీఆర్ ప్రసంగంలో స్పష్టత లోపించిందని విమర్శ
- ఖజానా ఖాళీ చేసి నిందలు వేస్తున్నారని కేసీఆర్‌పై ఆరోపణ
- రాహుల్ గాంధీతో తనకు గ్యాప్ లేదని స్పష్టం చేసిన రేవంత్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎల్కతుర్తి సభలో కేసీఆర్ అంతా అక్కసే వెళ్లగక్కారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన రేవంత్ పలు అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. కేసీఆర్ ఖజానాను లూటీ చేసి పోయి ఇప్పుడు అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆరోపించారు. తాను ఇంకా ఇరవై ఏండ్లు రాజకీయాల్లో ఉంటానని రేవంత్ నమ్మకం వ్యక్తం చేశారు. ప్రజలు పదేళ్లు చాన్స్ ఇస్తారని నమ్మకం వ్యక్తం చేశారు. కేటీఆర్, హరీష్ రావులను పిల్లగాళ్ళు అని కేసీఆర్ అన్నాడు. మరి వారినేందుకు అసెంబ్లీకి పంపిస్తున్నాడని ప్రశ్నించారు. సంవత్సరంన్నర నుండి పథకాలు తీసుకొచ్చాం. ఇప్పుడు వాటన్నింటిని స్ట్రీమ్ లైన్ చేస్తున్నామని తెలిపారు. తాను చట్టప్రకారమే నడుచుకుంటానని అరెస్టులు చేయమని డిమాండ్ వస్తోందని అరెస్ట్ చేయించలేనని స్పష్టం చేశారు. చేసిన పనులు చెప్పుకోవడంలో కొంత వెనకపడ్డామని. స్పీడప్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికార యంత్రాంగాన్ని స్ట్రీమ్ లైన్ చేశామని తెలిపారు. కొంత మంది అధికారుల తీరు గురించి తనకు తెలుసని అయినా తప్పనిసరి పరిస్థితుల్లో కొనసాగించాల్సి వస్తోందన్నారు. కేసీఆర్ మాటల్లో స్పష్టత లేదని, రాష్ట్ర ఖజానాను కేసీఆర్ పూర్తిగా ఖాళీ చేసి, ఇప్పుడు ఆ నిందను కాంగ్రెస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని, కేసీఆర్ అభద్రతాభావంతో మాట్లాడుతున్నారని రేవంత్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి, తనకు మధ్య దూరం పెరిగిందంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. రాహుల్ గాంధీతో తనకు ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని స్పష్టం చేశారు.అవసరాలకు అనుగుణంగా

2లో..

### అతిథులను కాపాడడంలో

# నేను విఫలమయ్యాను

## - ఒమర్ అబ్దుల్లా కామెంట్స్



**శ్రీనగర్ (ప్రశ్న న్యూస్)** ఏప్రిల్ 22వ తేదీన జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై మరోసారి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందించారు. తమ రాష్ట్రానికి వచ్చిన అతిథులను కాపాడుకోవడంలో తాను విఫలం అయ్యానని చెప్పుకొచ్చారు. కనీసం మృతుల కుటుంబాలు, క్షతగాత్రులకు క్షమాపణలు కూడా చెప్పేందుకు మాటలు రావట్లేదని వెల్లడించారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని రాష్ట్ర హోదా కావాలని

2లో..




# భారత్‌తో యుద్ధం చేయలేం

## పాక్ ఆర్మీకి సైనికులు రాజీనామాలు..?

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పాకిస్తాన్ ఆర్మీలో సైనికులు రాజీనామాలు చేస్తున్నారనే వార్త ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఇటీవల జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్‌తో ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఈ పరిణామం

2లో..

### కొత్త రేషన్ కార్డులు

# వచ్చేస్తున్నాయ్

## - మే నెల నుంచి సన్న బియ్యం మీ ఇంట్లో

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయడానికి అంతా సిద్ధం చేసింది. గ్రామ సభలను నిర్వహించి వారి నుంచి అర్జీలను తీసుకున్న తర్వాత అర్హులను నిర్ణయించింది. కొత్త రేషన్ కార్డు దారులను ఎంపిక చేయడం ద్వారా వారికి అన్నీ ఉచితాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా మే నెల నుంచి అందనున్నాయి. కొత్త రేషన్ కార్డు దారులందరికీ వారికి సంబంధించిన కార్డులను ఈ నెలాఖరులోపు మంజూరు చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించడంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటికే లబ్దిదారుల ఎంపిక పూర్తి కావడంతో పాటు మూడేళ్లు నిండిన వారిందరికీ మే నెల




నుంచి కొత్త రేషన్ కార్డుపై ఆరు కిలోల సన్న బియ్యాన్ని పంపిణీ చేయనుంది.

### - లక్షల్లో దరఖాస్తులు..

గ్రామసభల ద్వారా మాత్రమే కాకుండా మీ సేవ కేంద్రాల ద్వారా కూడా లక్షల సంఖ్యలో ప్రజలు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

2లో..

### ఏపీ రాజ్యసభ అభ్యర్థిగా

# అనూహ్య ఎంపిక

## - పాకా వెంకట సత్యనారాయణను ఖరారు చేసిన అధిష్టానం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీ అయిన రాజ్యసభ స్థానం భర్తీపై ఉత్కంఠ వీడింది. విజయసాయిరెడ్డి రాజీనామాతో రాజ్యసభ స్థానం ఖాళీ కాగా ఈ స్థానం బీజేపీకి దక్కనుంది. బీజేపీ నేత పాకా వెంకట సత్యనారాయణకు ఎన్డీఏ కూటమి తరుపున

2లో..

# ఇకపై అమరావతి అభివృద్ధి అన్ స్టాపబుల్

## - వి లాంచ్‌పాడ్ 2025 - స్టార్టప్ ఎక్స్‌పోలో సీఎం చంద్రబాబు

- రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి అని చంద్రబాబు వెల్లడి
- విశాఖను ఆర్థిక, తిరుపతిని ఆధ్యాత్మిక రాజధానిగా తీర్చిదిద్దే ప్రణాళిక
- రాయలసీమలో స్టీల్ ప్లాంట్, నాలెడ్జ్ హబ్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్ రంగాలపై దృష్టి
- ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటుబీ మేకిన్ ఇండియా కింద హార్డ్‌వేర్ రంగం అభివృద్ధి



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమరావతి అభివృద్ధి పైన ప్రస్తుతం అందరి ఆసక్తి నెలకొంది. ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి నిర్మాణాల పునః ప్రారంభానికి రానున్న క్రమంలో రాజధాని అమరావతి పైన ప్రధానంగా చర్చ జరుగుతుంది. ఇక ఇదే క్రమంలో విట్ యూనివర్సిటీలో వి లాంచ్ ప్యాడ్ 2025 స్టార్టప్ ఎక్స్పోకు హాజరైన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి అభివృద్ధి పైన కీలక వ్యాఖ్యలు చేశారు.

### - అమరావతి అభివృద్ధిపై సీఎం చంద్రబాబు

అమరావతి అభివృద్ధి అన్ స్టాపబుల్ అని సీఎం చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. వైజాగ్ లో గూగుల్ సెంటర్ వస్తుందని, కొత్త ఎయిర్పోర్ట్ నిర్మాణం పూర్తి కానుందని రాష్ట్రం

2లో..

### శాంతి కుమారికి

# కొత్త బాధ్యతలు

- ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ వైస్ చైర్‌పర్సన్‌గా శాంతి కుమారి
- సీఎస్‌గా రిటైర్ అయిన వెంటనే బాధ్యతలు
- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ సీఎస్ శాంతి కుమారి ఈనెలాఖరున రిటైర్ కానున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆమె స్థానంలో కొత్త సీఎస్‌గా సీనియర్ ఐఏఎస్ రామకృష్ణారావు బాధ్యతలు స్వీకరించనున్నారు. అయితే శాంతి కుమారికి రేవంత్ సర్కార్ కొత్త

2లో..

# మావోయిస్టులతో చర్చలకు శాంతి కమిటీ ఏర్పాటు

## - జానారెడ్డి, సీఎం రేవంత్ భేటీలో చర్చ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో కీలక సమీకరణాలు చోటు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం పైన మాజీ సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేసారు. అటు స్థానిక సంస్థల ఎన్నికల దిశగా ప్రభుత్వం లో కసరత్తు కొనసాగుతోంది. ఇటు మంత్రివర్గం– పీసీసీ విస్తరణ పైన తుది నిర్ణయం జరగలేదు. ఈ సమయంలో అనూహ్యంగా సీనియర్ నేత జానారెడ్డికి ఇంటికి వెళ్లిన సీఎం రేవంత్ కీలక మంత్రాంగం చేసారు. జానారెడ్డి అనుభవం వినియోగించుకోవాలని డిసైడ్ అయ్యారు. కొత్త బాధ్యతలు అప్పగించారు. ఈ ఎపిసోడ్ లో కాంగ్రెస్ ముఖ్య నేత దిగ్విజయ్ సింగ్ కీలక పాత్ర పోషించారు.

### - జానా రెడ్డితో రేవంత్ భేటీ

ముఖ్యమంత్రి రేవంత్ కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డితో కీలక మంత్రాంగం చేసారు. శాంతి చర్చల దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆపరేషన్ కగార్, శాంతి చర్చలు, కాల్పుల విరమణ తదితర అంశాలపై జానారెడ్డితో సీఎం చర్చించారు. తాజాగా సీఎం రేవంత్‌తో శాంతి చర్చల కమిటీ తెలంగాణ నేతలు భేటీ అయ్యారు. కాల్పుల విరమణ, శాంతి చర్చల అంశం పై జానారెడ్డి సలహాలు తీసుకుంటామని సీఎం తెలిపారు. అందులో



భాగంగానే శాంతి చర్చలపై సీఎం రేవంత్, జానారెడ్డి, కేకే, వేం నరేందర్ రెడ్డి చర్చించారు. అదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్‌తో సీఎం ఫోన్లో మాట్లాడారు. గతంలో ఏపీ పార్టీ ఇంచార్జ్‌గా దిగ్విజయ్ సింగ్ ఉన్న సమయంలోనే శాంతి చర్చలు జరిగాయి.

2లో..

### పద్మవిభూషణ్

# అవార్డు అందుకున్న బాలకృష్ణ

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రముఖ సినీ హీరో నందమూరి బాలకృష్ణ భారతదేశ మూడవ అత్యున్నత పౌర పురస్కారం అయిన 'పద్మభూషణ్' అవార్డును అందుకున్నారు. సినీ రంగంలో, ప్రజా సేవలలో ఆయన చేసిన విశిష్ట సేవలకు గానూ భారత ప్రభుత్వం ఈ గౌరవాన్ని అందజేసింది. సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన పద్మ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని బాలయ్య అందుకున్నారు. పద్మభూషణ్ అవార్డ్ స్వీకరించిన నేపథ్యంలో అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నందుకు సోషల్ మీడియా వేదికగా బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. 'పద్మభూషణ్ ఎన్బీకే' హ్యాష్ ట్యాగ్స్ తో ట్విట్టర్ ఎక్స్ ని హోరెత్తిస్తున్నారు. జై బాలయ్య అంటూ నినాదాలు చేస్తున్నారు. పలువురు సినీ రాజకీయ ప్రముఖులు సైతం బాలకృష్ణకి అభినందనలు తెలిపారు. బాలకృష్ణ పద్మభూషణ్ అందుకుంటున్న ఫోటోలు, వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

దివంగత నందమూరి తారక రామారావు వారసుడిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన బాలకృష్ణ గత ఐదు దశాబ్దాలుగా సినిమాల్లో రాణిస్తున్నారు. 100కి పైగా సినిమాలలో నటించి, తెలుగు సినిమా రంగంలో తనదైన ముద్ర వేశారు. పౌరాణిక, చారిత్రాత్మక, సాంఘిక,



సోషియో ఫాంటసీ ఇలా ప్రతీ జోనర్ లో అనేక వైవిధ్యమైన పాత్రల్లో ప్రేక్షకులను అలరించారు. ఆరు పదుల వయసు దాటినా రెట్టింపు ఉత్సాహంతో ఇప్పటికీర్ రెస్ట్ లేకుండా వరుసగా సినిమాలు చేస్తూనే ఉన్నారు. రాజకీయాల్లోనూ బాలయ్య తన తండ్రి బాటలో నడిచారు. హిందూపురం నియోజకవర్గం నుంచి తెలుగు దేశం పార్టీ తరపున మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన బాలకృష్ణ.. ప్రజల సమస్యలపై చురుకుగా స్పందిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలలో పాలుపంచుకుంటున్నారు. అలానే తన తల్లి బసవతారకం స్మారకంగా స్థాపించిన బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా, క్యాన్సర్ బాధితులకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నారు. అనేక మంది రోగులకు తన వంతు సహాయం అందిస్తున్నారు.

2లో..

# పాతబస్తీ ఈడీ ఆకస్మిక దాడులు

## - భూదాన్ భూములలో అక్రమాలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ పాతబస్తీలోని యాకుత్‌పురా, సంతోష్‌నగర్ ప్రాంతాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు హఠాత్తుగా ఇళ్లపై మెరుపు దాడులు నిర్వహించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఈ సోదాలు భూదాన్ భూముల వ్యవహారానికి సంబంధించినవి కావడంతో ఈ కేసు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ వ్యవహారంలో పలువురు ఉన్నత స్థాయి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు ఈఐపీఎల్ అనే ఒక ప్రైవేట్ కంపెనీ భూములు విక్రయించిందని ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. అంతేకాకుండా ఈఐపీఎల్ కంపెనీకి సుకూర్ అనే వ్యక్తి బినామీగా వ్యవహరిస్తున్నట్లు ఈడీ అధికారులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఈడీ




అధికారులు సుకూర్‌తో పాటు అతని బంధువు షర్ఫన్, మరో ఇద్దరి వ్యక్తుల నివాసాలలో విస్తృతమైన సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో భూముల క్రయవిక్రయాలకు సంబంధించిన కీలకమైన పత్రాలు, ఇతర ఆధారాలు లభ్యమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో ఈడీ అధికారులు

2లో..

### గ్రూప్-1 పిటిషనర్లకు

# తెలంగాణ హైకోర్టు జరిమానా

- ప్రతి పిటిషనర్‌కు రూ. 20,000 జరిమానా
- కోర్టును తప్పుదోవ పట్టించారని హైకోర్టు ఆగ్రహం
- పిటిషనర్లపై చట్టపరమైన చర్యలకు ఆదేశం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకనంపై పిటిషన్ దాఖలు చేసిన అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తప్పుడు అఫిడవిట్లు సమర్పించి కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం



చేశారంటూ 19 మంది పిటిషనర్లకు రూ.20,000 జరిమానా విధించింది. అంతేకాకుండా, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల మూల్యాంకన ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, తమకు అన్యాయం

2లో..

# అతిథులను కాపాడడంలో నేను విఫలమయ్యాను

కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతానంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అమాయక పర్యటకుల ప్రాణాలను అడ్డంగా పెట్టుకుని తాను అస్సలే రాష్ట్ర హోదాను డిమాండ్ చేయనని తెగేసి చెప్పారు.ముఖ్యంగా పహల్గాం ఉగ్రదాడిపై చర్చించేందుకు అక్కడి అసెంబ్లీ నేడు అత్యవసరంగా సమావేశం అయింది. ఈ సందర్భంగానే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ చాలా ఎమోషనల్ అయ్యారు. ఇలాంటి దాడులు గతంలో చాలానే చూశామన్నారు. కానీ బైసరన్ లోయలో ఇంత పెద్ద స్థాయిలో దాడి చేయడం మాత్రం 26 ఏళ్లలో ఇదే తొలి సారి అని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి వచ్చిన అతిథులను కాపాడుకోవడం, వారిని సురక్షితంగా వారి ప్రాంతాలకు చేర్చడం అంతా రాష్ట్రం బాధ్యతే అని కానీ సీఎంగా తాను ఆ పని చేయలేక పోయనన్నారు. 26 మంది ప్రాణలు కాపాడడంలో పూర్తిగా విఫలం అయ్యానన్నారు.మృతుల కుటుంబాలు సహా క్షతగాత్రులకు బాధితులకు ఎలా క్షమాపణలు చెప్పాలో కూడా తెలియడం లేదని సీఎం ఒమబ్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తండ్రిని కోల్పోయిన పిల్లలకు, భర్తలను కోల్పోయిన భార్యలకు, హనీమూన్ కోసం వచ్చి తమలో సగభాగాన్ని కోల్పోయిన నవ వధువులకు ఏం చెప్పాలో, వారితో ఎలా మాట్లాడాలో కూడా తనకు తెలియడం లేదన్నారు. ఈ ఉగ్రదాడి తర్వాత తాను ఏ ముఖం పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం వద్ద రాష్ట్ర హోదాను డిమాండ్ చేయగలనన్నారు. తన రాజకీయాలు అంత చౌకబారువి కావంటూనే గతంలో రాష్ట్ర హోదా అడిగామని గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా అడుగుతానని స్పష్టం చేశారు. కాకపోతే ఇప్పుడు 26 మంది చనిపోయారు కాబట్టి రాష్ట్ర హోదా ఇవ్వమని అడగడం చాలా సిగ్గుగా అనిపిస్తుందన్నారు. అలాగే రాష్ట్ర ప్రజలు తమకు మద్దతు ఇస్తే మిలిటెన్సీ, ఉగ్రవాదం పూర్తిగా అంతం అవుతాయని జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వివరించారు. దానికి ఇదే ఆరంభం అని ఈ ఉద్యమానికి హానీ కల్గించేదేదీ మాట్లాడకూడదు, చేయకూడదని సూచించారు. తాము మిలిటెంట్లను తుపాకులతో అదుపు చేయగలమని కానీ అందుకు ప్రజల మద్దతు చాలా అవసరం అన్నారు. వారంతా మద్దతిస్తే జమ్ము కశ్మీర్ ఇకపై చాలా ప్రశాంతంగా ఉంటుందని చెప్పారు.

# కేసీఆర్‌ది అంతా అక్కసే

కేసీఆర్, ప్రధాని నరేంద్ర మోదీ తమ వైఖరిని మార్చుకుంటున్నారని విమర్శించారు. దేశానికి దివంగత ప్రధాని ఇందిరా గాంధీ లాంటి నాయకత్వం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికలకు చివరి 6 నెలలు నా పాలనపై చర్చ జరుగుతుందని వ్యాఖ్యానించారు. నక్సలైటన్లను ఏరివేసే ఆపరేషన్ కగార్ అంశం పై జాతీయ స్థాయిలో చర్చ జరగాలని రేవంత్ అన్నారు. కగార్ పై మా పార్టీ నిర్ణయం తీసుకున్నాక ప్రభుత్వ విధానం ప్రకటిస్తామన్నారు. నేను కమిట్మెంట్ ఇస్తే చేసి తీరుతానని పార్టీ నేతలకు భరోసా ఇచ్చారు. అద్దంకి దయాకర్ కు ఎమ్మెల్సీ ఇస్తా అని చెప్పాను. ఇప్పించానన్నారు. అయితే కొంత మంది కాంగ్రెస్ నేతలు దారి తప్పుతున్నారని అన్నారు. పదవుల కోసం బ్లాక్ మెయిల్ చేసేలా మాట్లాడితే పదవులు రావన్నారు. నియోజకవర్గాల్లో తిరగండి అంటే హైదరాబాద్‌లో తిరుగుతున్నారని ఎమ్మెల్యే అయ్యాక మనోడు మందోడు అని ఉండదని స్పష్టం చేశారు. సీఎల్పీ సమావేశంలో అందర్నీ అప్రమత్తం చేస్తున్నా మార్పు రావడం లేదన్నారు. ప్రభుత్వ పథకాలను ఎమ్మెల్యేలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లాలని, వారు వెళితేనే పథకాలు ప్రజల్లోకి వెళతాయని అన్నారు. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయని అన్నారు. ఇష్టానుసారంగా మాట్లాడితే పార్టీ నేతలే నష్టపోతారని హెచ్చరించారు.

# భారత్‌తో యుద్ధం చేయలేం

మరింత ఆందోళన కలిగిస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, పెద్ద సంఖ్యలో సైనికులు తమ ఉద్యోగాలకు రాజీనామా చేస్తున్నట్లు తెలుస్తోంది. పాహల్గామ్ దాడిలో 26 మంది పౌరులు మరణించడం, పలువురు గాయపడటంతో సైనికుల్లో భయాందోళనలు నెలకొన్నాయని సమాచారం. భారత్ ప్రతీకార చర్యకు దిగవచ్చనే భయంతో చాలా మంది సైనికులు తమ కుటుంబాల ఒత్తిడి మేరకు రాజీనామాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, సైన్యంలోని అంతర్గత విభేదాలు, నాయకత్వంపై అసంతృప్తి కూడా రాజీనామాలకు కారణమని కొందరు విశ్లేషిస్తున్నారు. దాదాపు 4500 మంది ఆర్మీ సైనికులతో పాటు, 250 మంది ఆఫీసర్లు సైతం తమ పదవులకు రాజీనామా చేసినట్టు తెలుస్తోంది.ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు పాకిస్తాన్ ఆర్మీ ఉన్నతాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. సైనికుల మనోధైర్యాన్ని పెంచేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే, పెరుగుతున్న ఉద్రిక్తతలు మరియు ఆర్థిక సంక్షోభం కారణంగా సైనికుల్లో నెలకొన్న భయాందోళనలు ఇప్పట్లో తగ్గేలా కనిపించడం లేదు. ఒకవైపు సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, మరోవైపు సైనికుల రాజీనామాలతో పాకిస్తాన్ ఆర్మీ సంక్షోభంలో కూరుకుపోయిందనే చెప్పవచ్చు. ఈ పరిణామాలు దేశ భద్రతపై ఎలాంటి ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.

# కొత్త రేషన్ కార్డులు వచ్చేస్తున్నాయ్

గత పదేళ్ల నుంచి తమకు రేషన్ కార్డు లేదని, తమ ఆర్థిక పరిస్థితిని చూసి అందించాలని వారు అధికారులను కోరుతున్నారు. ప్రభుత్వం కూడా అర్హులైన పేదలు ఎంత మంది ఉన్నా అందరికీ తెలుపు రంగు రేషన్ కార్డులు అందచేస్తామని తెలిపింది. దీంతో కుటుంబంలో ఎంతమంది సభ్యులున్నా, వారు పెళ్లిళ్లయి బయటకు వెళ్లిపోయినా వారి పేరు మీద కూడా కొత్త రేషన్ కార్డును మంజూరు చేయనున్నారు. కుటుంబంలో ఎంతమంది సభ్యులన్నప్పటికీ ఒక్కొక్కరికీ ఆరు కిలోల సన్నబియ్యం పంపిణీ చేయనుండటంతో వీటికి డిమాండ్ పెరిగింది.

### కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు స్థానికత గుర్తింపుతో పాటు అనేక రకాలైన ధ్రువీకరణ పత్రాలను రేషన్ కార్డు మంజూరుకు అడిగే వారు. వాటి ఆధారంగానే జారీ చేసేవారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులన్నీ రద్దు చేసి ఆహార భద్రత కార్డులను జారీ చేయాలని నిర్ణయించింది. అయితే బీఆర్ఎస్ అధికారంలో ఉన్న తొమ్మిదేళ్లు అది సాధ్యం కాలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించడంతో పాటు జనవరి 26వ తేదీన ముఖ్యమంత్రి ఈ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించారు. మే నెలలో లబ్దిదారులు సన్న బియ్యం అందుకునే విధంగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలన్న ప్రభుత్వం ఆదేశం మేరకు మరో నాలుగు రోజుల్లోనే ఈ కొత్త రేషన్ కార్డుల జారీ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో కొన్ని లక్షల కుటుంబాలకు రేషన్ కార్డుల ద్వారా లబ్ది చేకూరనుంది.

# ఏపీ రాజ్యసభ అభ్యర్థిగా అనూహ్య ఎంపిక

రాజ్యసభ స్థానానికి అభ్యర్థిగా ఖరారు చేశారు. భీమవరానికి చెందిన పాకా వెంకట సత్యనారాయణ గతంలో భీమవరం కౌన్సిలర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఏపీ బీజేపీ క్రమశిక్షణా సంఘానికి అధ్యక్షుడిగా ఉన్నారు. రాజ్యసభ స్థానానికి నామినేషన్ దాఖలు చేసేందుకు మంగళవారం మధ్యాహ్నం వరకూ గడువు ఉంది. దీంతో కూటమి తరుపున పాకా వెంకట సత్యనారాయణను రాజ్యసభ స్థానానికి అభ్యర్థిగా ఎంపిక చేశారు.వ్యక్తిగత ఖాతాలో విజయసాయిరెడ్డి తన ఎంపీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఓ సీటు ఖాళీ కాగా ఈ స్థానం ఏ పార్టీకి దక్కుతుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఓ దశలో విజయసాయిరెడ్డి బీజేపీ తరుఫన బరిలో ఉంటారంటూ వార్తలు కూడా వచ్చాయి. అలాగే తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై పేరు కూడా ప్రముఖంగా వినిపించింది. అలాగే మొన్నటి లోక్ సభ ఎన్నికల్లో ఓడిపోయిన కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ పేరు కూడా తెరపైకి వచ్చింది. ఈ క్రమంలోనే సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేరు కూడా చర్చకు వచ్చిందంటూ వార్తలు వచ్చాయి. చివరకు ఏపీకి చెందిన వ్యక్తికే ఈ స్థానాన్ని కట్టబెట్టాలని నిర్ణయించిన బీజేపీ పాక వెంకట సత్యనారాయణ పేరును ఖరారు చేసినట్లు సమాచారం.మరోవైపు విజయసాయిరెడ్డి మరో రెండేళ్లు పదవీకాలం ఉండగానే తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు ప్రకటించిన విజయసాయిరెడ్డి వైసీపీకి కూడా గుడ్ బై చెప్పారు. ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటానని వ్యవసాయం చేసుకుంటానంటూ ప్రకటించారు. విజయసాయిరెడ్డి రాజీనామాను రాజ్యసభ ఛైర్మన్ వెంటనే ఆమోదించారు. అనంతరం ఆ స్థానం ఖాళీ అయినట్లు ప్రకటించారు. దీంతో ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు నామినేషన్ గడువు ముగియనుంది. దీంతో తీవ్ర తర్జనభర్జనల అనంతరం పాక వెంకట సత్యనారాయణ వైపు బీజేపీ అధిష్టానం మొగ్గుచూపినట్లు సమాచారం.

# పద్మవిభూషణ్ అవార్డు అందుకున్న బాలకృష్ణ

వివిధ రంగాలలో ఆయన విశిష్ట సేవలకు గౌరవంగా కేంద్ర ప్రభుత్వం ఆయన్ను పద్మభూషణ్ తో సత్కరించింది. ఇకపోతే బాలకృష్ణతో పాటుగా తమిళ అగ్ర హీరో అజిత్ కుమార్ కూడా పద్మ భూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు

ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్, బాలీవుడ్ డైరెక్టర్ శేఖర్ కపూర్, భారతీయ నాట్యకళా రంగంలో విశిష్ట సేవలకుగాను శోభనా చంద్రకుమార్ లకు పద్మభూషణ్ ను ప్రధానం చేసారు. దివంగత గజల్ గాయకుడు పంకజ్ ఉదాస్ కు మరణానంతరం ఈ గౌరవం దక్కింది. అలానే బాలీవుడ్ సింగర్ అరిజిత్ సింగ్ కు పద్మశ్రీ అవార్డు వరించింది.

# ఇకపై అమరావతి అభివృద్ధి అన్ స్టాపబుల్

ప్రగతిపథంలో ముందుకు సాగుతుందన్నారు. ప్రధాని నేతృత్వంలో మేకిన్ ఇండియా ముందుకు సాగుతుందని చంద్రబాబు తెలిపారు. దేశ అభివృద్ధిలో సాంకేతికత కీలకపాత్ర పోషిస్తుందని, సాంకేతికతలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందు వరుసలో నిలవాలని, అందుకు తగిన కృషి జరుగుతుందని చంద్రబాబు తెలిపారు.

### - కర్నూలులో డ్రోన్ సిటీ నిర్మాణం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలులో దేశంలోని కీలకమైన డ్రోన్ సిటీ నిర్మాణం చేస్తున్నామని, సాటిలైట్ కూడా ఇక్కడి నుంచి పంపే ఏర్పాటు చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. విద్యార్థులందరూ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు. ల్యాండ్ పూలింగ్ పద్ధతిలో అమరావతికి భూములు సేకరించామని, 29 వేల మంది రైతులు అమరావతికి భూములు ఇచ్చారని, వాళ్ళు కొందరినైనా దత్తత తీసుకోవాలని చంద్రబాబు ఆకాంక్షించారు.

### స్వర్ణాంధ్ర 2047 రోడ్ మ్యాప్ సిద్ధం

మే రెండవ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ అమరావతికి వస్తున్నారని చంద్రబాబు మళ్లీ అమరావతి పనులు పునః ప్రారంభం అవుతాయని తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 రోడ్ మ్యాప్ సిద్ధం చేశామని, విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇవ్వడానికి ఏం చేయాలో అది చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచంలోనే హైదరాబాద్ ను ఐటీ హబ్ గా తీర్చిదిద్దామని చంద్రబాబు, ప్రపంచంలోనే తెలుగు వాళ్ళు ట్రెండ్ సెట్ చేశారని పేర్కొన్నారు.

### రాష్ట్రంలో ఐదుచోట్ల రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్ లు

అమరావతి విట్ లో 95% ప్లేస్మెంట్స్ వస్తున్నాయని, అయితే ఉద్యోగాలు చేసి సంతృప్తి పడవద్దని, ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి మీరంతా ఎదగాలని విద్యార్థులను ఉద్దేశించి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఐదుచోట్ల రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్ లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అంతేకాదు అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో ఏఐకి భవిష్యత్తు ఉందని, విద్యార్థులు దాని మీద ఫోకస్ చేయాలన్నారు.

### కాశ్మీరులో ఉగ్రదాడిని ఖండించిన చంద్రబాబు

ఇక ఇదే సమయంలో కాశ్మీరులో ఉగ్రదాడిని ఖండించిన చంద్రబాబు భారత్ తో పెట్టుకుంటే ఎవరైనా మటాష్ అయిపోవాల్సిందే అని హెచ్చరించారు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు ప్రజలంతా సంఘటితం కావలసిన అవసరం ఉంటుందని చంద్రబాబు పేర్కొన్నారు.

# మావోయిస్టులతో చర్చలకు శాంతి కమిటీ ఏర్పాటు

### - జానా అనుభవంతో

శాంతి చర్చలు, కాల్పుల విరమణకు సంబంధించి జానా రెడ్డికి మంచి అనుభవం ఉంది. గతంలో చర్చలు జరిగిన సమయంలో జానా రెడ్డి హోంమంత్రిగా ఉన్నారు. చర్చల్లో జానారెడ్డి చాలా కీలకమైన పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో ఈ అంశాలకు సంబంధించి కాంగ్రెస్ సీనియర్ నేత సలహాలు, సూచనలు తీసుకుంటామని శాంతి చర్చల కమిటీకి సీఎం తెలిపారు. ఇందులో భాగం గానే జానారెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి కలిసి ఈ అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ఆపరేషన్ కగార్‌పై సీఎం జానారెడ్డితో పాటుగా కేశవ రావు సేవలు వినియోగించుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ వెల్లడించారు. కాగా, బీఆర్ఎస్ సభలోనూ మాజీ సీఎం కేసీఆర్ ఇదే అంశం పైన తన అభిప్రాయం వెల్లడించారు. శాంతి చర్చలు జరగాలని మావోయిస్టులు డిమాండ్ చేస్తున్నారని, శాంతి చర్చలు జరపాలని..కాల్పుల విరమణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### రేవంత్ స్పందన

ఈ అంశానికి సంబంధించి పార్టీ అధ్యక్షుడిగా, ప్రతిపక్ష నేతగా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని సభలో కేసీఆర్ ప్రకటించారు. సీఎం రేవంత్ సైతం మావోయిస్టుల సమస్యను శాంతిభద్రతల అంశంగా పరిగణించడం లేదని, ఇదొక సామాజిక అంశంగా పరిగణిస్తున్నామని తెలిపారు. మావోయిస్టులు డిమాండ్ చేస్తున్న శాంతి చర్చలు, కాల్పుల విరమణపై తెలంగాణ ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకున్నట్లైతే మిగిన రాష్ట్ర ప్రభుత్వాలపై కూడా దీని ప్రభావం పడనుంది. మిగిలిన రాష్ట్ర ప్రభుత్వాలు కూడా త్వరితగితిన స్పందిస్తే శాంతి చర్చల అంశం తెరమీదకు రానుంది. కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి పెరిగే అవకాశం ఉండటంతో శాంతి చర్చలు జరిగే అవకాశం ఉంది. ఇప్పుడు తమ వద్దకు వచ్చిన ప్రతిపాదనలు పార్టీ అధినాయకత్వానికి నివేదిస్తామని రేవంత్ స్పష్టం చేసారు.

# శాంతి కుమారికి కొత్త బాధ్యతలు

బాధ్యతలు అప్పగించింది. ఆమెను ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ వైస్ చైర్‌పర్సన్‌గా నియమించారు. సీఎస్‌గా శాంతి కుమార్ రిటైర్ అయిన వెంటనే కొత్త బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు సర్కార్ ఉత్తర్వులు జారీ చేశారు. 1989 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శాంతి కుమారి తన సుదీర్ఘమైన కెరీర్‌లో అనేక కీలకమైన ప్రభుత్వ పదవులను నిర్వహించారు. వివిధ జిల్లాలకు కలెక్టర్‌గా, ఇతర ముఖ్యమైన పరిపాలనా పదవులు కూడా నిర్వహించారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో వైద్యారోగ్య శాఖకు ప్రిన్సిపల్ సెక్రటరీగా ఆమె విశేష కృషి చేశారు. కమిషనర్, వాణిజ్య పన్నుల శాఖ, ఈ కీలకమైన రెవెన్యూ శాఖకు ఆమె కమిషనర్‌గా పనిచేశారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులవ్వడానికి ముందు.. అటవీ, పర్యావరణ శాఖకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. జనవరి 12, 2023న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎస్‌గా బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్రానికి మొట్టమొదటి మహిళా ప్రధాన కార్యదర్శి శాంతి కుమారే కావటం విశేషం. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆమెను మారుస్తారనే ప్రచారం జరిగినా సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ఆమెనే సీఎస్‌గా కొనసాగించారు. తాజాగా ఆమె సేవలను వినియోగించుకోవాలని భావించి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ వైస్ చైర్‌పర్సన్‌గా నియమించారు.

# గ్రూప్-1 పిటిషనర్లకు తెలంగాణ హైకోర్టు జరిమానా

జరిగిందని ఆరోపిస్తూ మొత్తం 19 మంది అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. తమకు జారీ చేసిన మార్కుల మెమోలకు, వెబ్‌సైట్‌లో పొందుపరిచిన మార్కులకు మధ్య వ్యత్యాసాలు ఉన్నాయని వారు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. పారదర్శకంగా రీవాల్యుయేషన్ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై సోమవారం జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా, పిటిషనర్లు సమర్పించిన ప్రమాణ పత్రాలు తప్పులతడకగా ఉన్నాయని, వారు వాస్తవాలను దాచిపెట్టారని టీజీపీఎస్సీ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

టీజీపీఎస్సీ న్యాయవాది వాదనలు, ప్రాథమిక ఆధారాలను పరిశీలించిన ధర్మాసనం, అభ్యర్థులు ఉద్దేశపూర్వకంగా తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేశారని నిర్ధారించింది. వాస్తవాలను దాచిపెట్టి న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో, ప్రతి పిటిషనర్‌కు రూ.20,000 చొప్పున జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా, తప్పుడు ప్రమాణ పత్రాలు సమర్పించినందుకు గాను వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జ్యుడీషియల్ రిజిస్ట్రార్‌ను హైకోర్టు ఆదేశించింది.

# పాతబస్తీ ఈడీ ఆకస్మిక దాడులు

అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్‌ను, మహేశ్వరం తహసీల్దార్‌ను కూడా విచారించారు.వారిచ్చిన సమాచారం ఆధారంగా ఈ సోదాలు మరింత లోతుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. భూదాన్ భూముల వ్యవహారం చాలా కాలంగా వివాదాస్పదంగా ఉంది. పేద ప్రజల కోసం ఉద్దేశించిన ఈ భూములను కొందరు అక్రమంగా సొంతం చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మహేశ్వరం ప్రాంతంలోని సుమారు వంద ఎకరాల భూదాన్ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి లేఅవుట్లు వేసి అమ్మకాలు జరిపినట్లు ఆరోపణలు రావడంతో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. మునావర్ ఖాన్, ఖదీర్ ఉన్నిసా అనే వ్యక్తులు ఈ అక్రమ అమ్మకాలు జరిపినట్లు తెలుస్తోంది.

ఈ అక్రమాలకు పాల్పడిన వారిలో పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా ఉండటం ఈ కేసును మరింత సున్నితంగా మార్చింది.ఈడీ అధికారులు ఇప్పుడు ఈ భూముల అసలు యజమానులు ఎవరు, ఎవరెవరికి ఈ భూములు అక్రమంగా బదిలీ అయ్యాయి ఈ ప్రక్రియలో ఎవరెవరు లబ్ధి పొందారు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ముఖ్యంగా ఈఐపీఎల్ కంపెనీకి, సుకూర్‌కు మధ్య ఉన్న సంబంధం ఏమిటి.? ఈ భూముల విక్రయాలలో వారి పాత్ర ఏమిటి అనే విషయాలను ఈడీ నిశితంగా పరిశీలిస్తోంది.

పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు ఈ భూములు ఎలా విక్రయించబడ్డాయి.? ఈ లావాదేవీలలో ఎటువంటి నిబంధనలు ఉల్లంఘించబడ్డాయి అనే విషయాలను కూడా ఈడీ అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ సోదాలు, విచారణలు రాబోయే రోజుల్లో మరిన్ని సంచలన విషయాలను వెలుగులోకి తెచ్చే అవకాశం ఉంది. ఈ కేసులో దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఈడీ సిద్ధమవుతోంది.

# రాజన్న సేవలో...
# వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్

### - తన జన్మదిన వేడుకల సందర్భంగా
### ప్రత్యేక పూజలు..స్వామివారి దర్శనం




వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో ఆలయ పర్యవేక్షకులు జి శ్రీనివాస్ శర్మ సి.ఐ వీరప్రసాద్ కు స్వామి వారి కండువా అందజేయగా,ఆలయ అర్చకులు వారికి వేదోక్త ఆశీర్వచనం అందించి లడ్డు ప్రసాదం అందించారు. వారి వెంట ఆలయ పరిశీలకులు రాజేందర్,గిరిబాబు, ప్రోటోకాల్ సిబ్బంది ఉన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి: అదనపు కలెక్టర్



### లెనిన్ వత్సల్ టొప్పో

మహబూబాబాద్( ప్రశ్న న్యూస్)ప్రజావాణిలో ఫిర్యాదు చేసే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా నెల్లికుదురు మండలం నరసింహుల గూడెం గ్రామానికి చెందిన ప్రజలు గ్రామంలో ఎ.ఎన్.ఎం. గా వైద్య సేవలు అందించిన కె. జ్యోతిని డిప్యుటేషన్ పై వేరే గ్రామానికి పంపివ్వడం జరిగిందని, అట్టి ఎ.ఎన్.ఎం.ను తమ గ్రామంలోనే కొనసాగేలా చూడాలని కోరారు.మహబూబాబాద్ వినియోగదారుల సంక్షేమ మండలి అధ్యక్షులు రేషన్ షాపుల ద్వారా తెల్ల కార్డు కలిగిన లబ్ధి దారులకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయబడుతున్న సన్నబియ్యం సరైన తూకంతో అందించాలని కోరారు. మహబూబాబాద్ మండలం అయోధ్య గ్రామానికి చెందిన దాసరి విజయ తన పేరు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో ఉన్నదని అట్టి జాబితా నుండి తన పేరును తొలగించుటకు కొంతమంది వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని తనకు న్యాయం చేయాలని అదే విధంగా తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయగలరని కోరారు.

# పిల్లల కోసం తల్లి ఆరాటం




### కన్న పిల్లల్ని కళ్లారా చూడాలనే ఆవేదన తీరేదెన్నడు
### పిల్లల కోసం కలెక్టర్ ను ఆశ్రయించిన తల్లి నగ్మా

కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) కొత్తగూడెంలో ఉంటున్న పిల్లల్ని చూసేందుకు కోసం 5 నెలలుగా ఆరాట పడుతున్న తల్లి నగ్మా అజ్మేర్ తన పిల్లలను చూడాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు చేసుకుంది. అయితే ఇది పిల్లల సంరక్షణకు సంబంధించిన విషయం కావడంతో హనుమకొండ జిల్లా కలెక్టర్ హనుమకొండ పిల్లల సంరక్షణ శాఖ కార్యాలయానికి ఆమె దరఖాస్తును ఫార్వర్డ్ చేశారు. నగ్మా అజ్మీర్ భర్త అమీర్ అహ్మద్, వారి ముగ్గురు పిల్లలు కొత్తగూడెంలో ఉండటంతో సదరు దరఖాస్తును కొత్తగూడెం బాలరక్ష కార్యాలయానికి పంపించిన నేపథ్యంలో చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, మహిళా సంఘం సభ్యుల సమక్షంలో నజ్మా, అమీర్ అహ్మద్ కు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం చైల్డ్ వెల్ఫేర్ డిస్ట్రిక్ట్ సభ్యులు ఎండి సాధిక్ పాషా మీడియాతో మాట్లాడుతూ కొత్తగూడెం శేషగిరి నగర్ కు చెందిననగ్మా అజ్మేర్, అమీర్ అహ్మద్ భార్యాభర్తలని వీరికి ముగ్గురు మగ పిల్లలు ఉన్నారని తెలిపారు. కాగా భార్యా భర్తలు గత ఐదు నెలలుగా విడివిడిగా ఉంటున్న నేపథ్యంలో పిల్లల తల్లి నగ్మా హనుమకొండలో ఉంటుందని, ఈ నేపథ్యంలో తన పిల్లలను చూడాలని ప్రయత్నించగా ఆమె భర్త పిల్లలను చూడనీయడం లేదని హనుమకొండ జిల్లా కలెక్టర్ కు నజ్మా దరఖాస్తు చేసుకుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ దరఖాస్తును పరిశీలించి పిల్లలకు సంబంధించిన విషయం కావడంతో హన్మకొండ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ శాఖ కార్యాలయానికి దరఖాస్తును ఫార్వార్డ్ చేశారని వివరించారు. అక్కడి అధికారులు దరఖాసుదారు నగ్మా అజ్మేర్ పిల్లలు భర్త భద్రాద్రి జిల్లా కొత్తగూడెంకు చెందినవారు కావడంతో వారు కొత్తగూడెం చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసుకు దరఖాస్తును ఫార్వర్డ్ చేయడంతో నజ్మా ను ఆమె భర్త అమీర్ ను బాల రక్షా భవన్ కు పిలిపించి మహిళా సంఘం సభ్యులు పోలీస్ అధికారులు సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. పిల్లల అభిప్రాయం తీసుకుంటామని వారికి ఎక్కడ రక్షణ, సంరక్షణ సంక్షేమ అభివృద్ధి ఉంటుందో అక్కడ పిల్లలను ఉంచేలా కమిటీ నిర్ణయం తీసుకుంటుందని సాదిక్ పాషా వివరించారు. ఈ సందర్భంగా నజ్మా మాట్లాడుతూ గత 5 నెలలుగా తాను తన పిల్లలను చూడటానికి ఎన్నోమార్లు ప్రయత్నం చేశానని, తన భర్త పిల్లలను

# భూములు కొట్టేసే కుట్రలో
# భాగంగానే 'ఉర్సా' ఆవిర్భావం

**- లోకేష్ అమెరికా వెళ్ళే ముందు నెలలోనే 'ఉర్సా' రిజిస్ట్రేషన్ - ఇండియన్ ఉర్సా ఏర్పాటైన 2 నెలల్లో రూ.3 వేల కోట్ల విలువైన భూముల దారాదత్తం**

**- కూటమి సర్కార్ అతిపెద్ద భూ కుంభకోణం - మాజీ ఎంపీ మార్గాని భరత్ ఆగ్రహం**

**- రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడిన మాజీ ఎంపీ, వైయస్ఆర్సీపీ అధికార ప్రతినిధి మార్గాని భరత్**

**రాజమహేంద్రవరం:** కూటమి ప్రభుత్వం రూ.3 వేల కోట్ల విలువైన భూములను కారుచౌకగా కట్టబెట్టిన 'ఉర్సా' మంత్రి నారా లోకేష్ బినామీ సంస్థ అని మాజీ ఎంపీ, వైయస్ఆర్సీపీ అధికార ప్రతినిధి మార్గాని భరత్ ఆరోపించారు. రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడుతూ ఏపీలో కారుచౌకగా ఈ సంస్థకు భూములను కట్టబెట్టాలనే కుట్రలో భాగంగానే 'ఉర్సా' ఆవిర్భవించిందని వెల్లడించారు. మంత్రి నారా లోకేష్ అమెరికాకు వెళ్ళడానికి ముందు నెలలోనే 'ఉర్సా' కంపెనీ రిజిస్టర్ అయ్యిందని అన్నారు. ఇండియాలో ఆ సంస్థను రిజిస్టర్ చేసిన రెండు నెలల్లోనే వేల కోట్ల విలువైన భూములను కట్టబెట్టేందుకు ఆఘమేఘాల మీద ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ఇది భారీ కుంభకోణం కాదా అని ప్రశ్నించారు..ఐటీ మంత్రి నారా లోకేష్ 2024 అక్టోబర్లో అమెరికాలో పర్యటించారు. సరిగ్గా ఆయన పర్యటనకు ముందు నెల అంటే 2024 సెప్టెంబర్ 27న అమెరికాలో ఉర్సా క్లస్టర్స్ అనే సంస్థను ఎన్ఆర్ఐ ప్రమోటర్లు కౌశిక్ పెందుర్తి, సతీష్ అబ్బూరిలు రిజిస్టర్ చేశారు. దీనికి అనుబంధ సంస్థగా ఇండియా ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ను 2025 ఫిబ్రవరి 12వ తేదీన రిజిస్టర్ చేశారు. ఈ సంస్థ ప్రధాన కార్యాలయంను హైదరాబాద్లోని ఒక రెసిడెన్షియల్ అపార్ట్మెంట్లోని ఫ్లాట్లో చూపించారు. అమెరికాలోనూ ఒక సాధారణ ఇంట్లో ఈ సంస్థ అంతర్జాతీయ కార్యాలయం ఉంది. ఈ సంస్థకు సంబంధించి ఏ సామర్థ్యంను చూసి ఇన్ని వేల కోట్ల విలువైన భూములను కారు చౌకగా ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందో అర్థం కావడం లేదు. ఇంత విలువైన భూములను కేటాయించేందుకు చకచక ఫైళ్ళు పరుగులు తీయించడం వెనుక మంత్రి నారా లోకేష్ ఉన్నారు. తన బినామీలకు కేటాయించేందుకే ఎటువంటి నిబంధనను పాటించలేదు. ఉర్సా భూముల కుంభకోణంపై పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తుంటే, సీఎం చంద్రబాబు, నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పరిశ్రమలశాఖమంత్రి ఎందుకు స్పందించడం లేదు? ఉర్సా పేరుతో ఒక సూట్కేస్ కంపెనీకి రూ.3 వేల కోట్ల విలువైన భూములను అతి తక్కువ రేటుకే అప్పగిస్తుంటే ఎందుకు మాట్లాడటం లేదు. గజం రూ.30 వేలు పలుకుతున్న విశాఖ కాపులుప్పాడు భూములను రూ.50 లక్షలకు ఎలా విక్రయిస్తున్నారు? దీనిలో మతలబు ఏమిటీ? ఇంత పెద్ద ఎత్తున కుంభకోణం జరుగుతుంటే చీఫ్ సెక్రటరీ, రెవెన్యూ సెక్రటరీలు ఏం చేస్తున్నారు? ప్రైవేటు వ్యక్తులకు ప్రభుత్వ భూములను ఎలా విక్రయిస్తారు?

### - కేంద్ర సంస్థలకు ఎక్కువ రేట్లకు

### భూ కేటాయింపులు

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలైన ఎల్ఐసీ, ఆర్బీఐ, ఎస్బీఐ, ఆయిల్ కార్పోరేషన్ తదతర సంస్థలకు విశాఖ, అమరావతిలో ఎకరా సుమారు రూ.4 కోట్ల చొప్పున రేటు ఖరారు చేశారు. కానీ ఊరు పేరు లేని ఉర్సా సంస్థకు వేల కోట్ల విలువైన భూములను ఎకరం రూ.50 లక్షలకు ఎలా విక్రయిస్తామని ముందుకు వచ్చారు? ఇది చంద్రబాబు, లోకేష్ బినామీలకు మేలు చేయడం కోసం కాదా? దేశ రక్షణకు అత్యంత కీలకమైన ఇండియన్ ఆర్మీకి సైతం ఎకరం రూ.కోటికి విక్రయించారు. ఉర్సాకు మాత్రం ఇంత తక్కువకు 56 ఎకరాలు ఎలా ఇస్తున్నారు? ఎందుకు ఈ సంస్థపై ప్రేమ? ఇది కాకుండా ఐటీ పార్క్లో ఎకరం మూడున్నర ఎకరాలను ఎకరం కోటిన్నరకు ఎలా ఇస్తున్నారు? మేం కూడా ఐటీ కంపెనీలు పెడతామంటే ఇదే విధంగా భూములు ఇస్తారా?

### - గతంలో బిల్లీరావుకు ఇదే తరహాలో చంద్రబాబు భూకేటాయింపులు

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో చంద్రబాబు ఆపద్దర్మ సీఎంగా ఉన్న సమయంలో ఆయకు సన్నిహితుడైన బిల్లీరావుకు ఐఎంజీ భారత్ అనే సంస్థ పేరుతో శంషాబాద్లో నాలుగు వందల ఎకరాలను కట్టబెట్టే ప్రయత్నం చేశారు. వైయస్ రాజశేఖరరెడ్డి సీఎం అయిన తరువాత ఈ కుంభకోణంపై విచారణ జరపడంతో ఆనాడు చంద్రబాబు చేసిన కుట్ర, అవినీతి వ్యవహారం బయటపడింది. చివరికి న్యాయస్థానాల్లో దీనిపై వ్యాజ్యాలు దాఖలవ్వడంతో కోర్టుల జోక్యంతో ఆ భూములను కాపాడటం జరిగింది. అలాగే ఇప్పుడు ఉర్సా సంస్థకు జరుపుతున్న భూ కేటాయింపులపై కూడా సీబీఐ వంటి సంస్థలతో విచారణ జరపాలి. ఉర్సా సంస్థ ప్రమోటర్లు 21 సెంచరీ కంపెనీలు పెట్టి డీఫాల్ట్ అయిన చరిత్ర కూడా ఉంది. రెండు నెలల్లో పుట్టిన సంస్థకు ఇన్ని వేల కోట్ల భూములు ఎలా ఇస్తున్నారు? దీనికి కేబినెట్ ఎలా అనుమతులు ఇచ్చింది? ఈ కుంభకోణంను కప్పిపుచ్చుకునేందుకు ఐటీని ఏపీలో ప్రమోట్ చేసుకుంటున్నట్లుగా చంద్రబాబు బిల్డప్ ఇస్తున్నారు. ఐటీకి తానే ఆధ్యుడనని చెప్పుకునే చంద్రబాబు పక్క రాష్ట్రాల్లోని బెంగుళూరు, చెన్నై, ముంబై, పూణేల్లో ఐటీ పార్క్లు ఎలా వచ్చాయి? దానికి కూడా తానే ఆధ్యుడా? హైదరాబాద్లోని హైటెక్ సిటీ కాంట్రాక్టర్లతో ఎన్టీఆర్ ట్రస్ట్ భవనాలను కట్టించుకోవడం నిజం కాదా? ఒకవైపు టీసీఎస్ వంటి ప్రముఖ ఐటీ సంస్థను ముందు పెట్టి 99 పైసలకు భూములను ఇచ్చి, దానిపైనే ప్రజల దృష్టి ఉండేలా చూడటం, తరువాత చాపకింద నీరులా ఉర్సా కంపెనీకి ఎకరం రూ.50 లక్షలకు విక్రయించేందుకు కుట్ర చేస్తున్నారు. డైవర్షన్ పాలిటిక్స్లో ఆరితేరిన చంద్రబాబు భూకుంభకోణం విషయంలోనూ అలాగే చేస్తున్నారు.

### - నారా లోకేష్ తోడల్లుడి కుటుంబానికి జయంతిపురంలో రూ.498 కోట్ల విలువైన భూములు

నారా లోకేష్ తోడల్లుడు, విశాఖ ఎంపీ భరత్ తండ్రి పట్టాభిరామారావుకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జూలై 2015లో కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలం జయంతిపురంలో ఏపీఐఐసీకి చెందిన నాలుగు వందల తొంభై ఎనిమిది ఎకరాల భూమిని కేవలం ఎకరం రూ.లక్షకు ఇచ్చారు. ఆనాడు మార్కెట్ రేటు ప్రకారం చూస్తే ఎకరం కోటి రూపాయలు ఉంది. అంటే రూ.498 కోట్ల విలువైన భూమిని ఎకరం రూ.లక్షకు ఇచ్చేశారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి సీఎంగా బాధ్యతలు తీసుకున్న చంద్రబాబు బంధుప్రీతి లేకుండా అందరినీ సమానంగా చూస్తామని పదవీ బాధ్యతలు చేపట్టారు. కానీ దానినితూట్లు పొడుస్తూ, తమ బంధువులకు మేలు జరిగేలా చర్యలు తీసుకున్నారు.

### - నక్కపల్లి భూములపై స్పందించాలి

నక్కపల్లి ఏపీఐఐసీ భూములను ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టే ప్రయత్నంపై ఏపీ చీఫ్ సెక్రటరీకి మాజీ కేంద్రప్రభుత్వ కార్యదర్శి శర్మ లేఖ రాశారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో స్టీల్ కర్మాగారం నిర్మాణం, తీర ప్రాంతంలో ఒక పోర్ట్ నిర్మాణంకు ఏపీఐఐసీకి నుంచి 2300 ఎకరాల భూమిని కూటమి ప్రభుత్వం ఆర్సెలర్ మిట్టల్ అనే ప్రైవేట్ కంపెనీకి ఇచ్చేందుకు సిద్దమయ్యింది. 2010 జూలైలో నక్కపల్లి మండలంలో ఎపిఐఐసీ 2300 ఎకరాలు భూమిని సేకరించింది. ఇది కాకుండా మరో 724 ఎకరాల ప్రభుత్వ భూమి, 753 ఎకరాల డీ పట్టా భూమిని కూడా సేకరించింది. ప్రభుత్వ భూమిని సేకరించినప్పుడు దానిని ప్రభుత్వరంగ సంస్థలకే కేటాయించాలి.

1894, 2013 భూసేకరణ చట్టాలకు విరుద్దంగా ప్రైవేటు సంస్థలకు ఎలా కేటాయిస్తారు? విశాఖ స్టీల్ ప్లాంట్ను కాపాడాలి, క్యాప్టీవ్ మైన్స్ ఇవ్వాలని విశాఖవాసులు కోరుతుంటే కూటమి ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదు. కానీ చట్టాలను ఉల్లంఘిస్తూ, అక్కడి పర్యావరణంను దెబ్బతీసేలా ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వం భూములు కట్టబెట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. దీనిపై శర్మగారు రాసిన లేఖలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చిత్తశుద్ది ఉంటే ఈ లేఖపై ప్రభుత్వం అధికారికంగా వివరణ ఇవ్వాలి.

## బాధితుల సమస్యలను చట్టపరిధిలో
# తక్షణమే పరిష్కరించాలి

**- జిల్లా ఎస్పీ వకుల్ జిందల్**



**విజయనగరం** విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, సోమవారం నాడు నిర్వహించారు.జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఎస్పీ గారు ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకువివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ 39 ఫిర్యాదులను స్వీకరించారు. పిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 14, కుటుంబ కలహాలకు సంబంధించినవి 9, మోసాలకు పాల్పడినట్లు 5,నగదు లావాదేవీలకు సంబంధించినవి 4, ఇతర అంశాలకు సంబంధించినవి 7 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమై నట్లయితే చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను అయన ఆదేశించారు.

## రూ. 2.5 కోట్ల విలువగల
# 72 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**- ఏడుగురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్ట్**

**- ఒక లారీ, మరో కారును స్వాధీనం చేసుకున్న టాస్క్ ఫోర్స్**



**తిరుపతి** శ్రీకాళహస్తి అటవీ ప్రాంతంలో 72 ఎర్రచందనం దుంగలతో పాటు ఒక లారీ, ఒక కారు స్వాధీనం చేసుకుని, ఏడుగురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆర్ఐ సాయి గిరిధర్ కు చెందిన ఆర్ ఎస్ ఐ సి. వినోద్ కుమార్ టీమ్ ఆదివారం శ్రీకాళహస్తి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లు తనిఖీ చేసి కాటూరు ఫారెస్ట్ బీటు పరిధిలో పంగూరు మెయిన్ రోడ్డు దొమ్మరపాళెం వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. సోమవారం ఉదయం ఒక కారు, దాని వెనుక ఒక లారీ కొద్దీ దూరం లో ఆపి, అందులోని వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు వారిని చేరుకుని చుట్టుముట్టారు. లారీని పరిశీలించగా అందులో 72 ఎర్రచందనం దుంగలు కమిపించాయి. వాటి విలువ సుమారు రూ. 2.5కోట్లు ఉంటుందని అంచనా వేశారు. వాహనాల్లో ఉన్న వారిని అరెస్ట్ చేయగా వారిలో నలుగురు తిరుపతి జిల్లాకు చెందిన వారు గాను, మరో ముగ్గురిని తమిళనాడు వాసులుగా గుర్తించారు. వారిని ఎర్రచందనం దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. డీఎస్పీలు వీ. శ్రీనివాసులురెడ్డి, షరీఫ్ లు విచారించగా సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# బస్సు, లారీ ఢీ..ప్రయాణికులకు గాయాలు

**ఒంగోలు** ప్రకాశం అద్దంకి మండలం చిన్న కొత్తపల్లి క్రాస్ రోడ్ వద్ద తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేటు ట్రావెల్స్ బస్సు మట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్ లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. హైదరాబాదు నుంచి కామేపల్లి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు చిన్న కొత్తపల్లి క్రాస్ రోడ్ నామ్ హైవేపై టిప్పర్ లారీ టర్నింగ్ తిరుగుతుండగా బస్సు బలంగా ఢీ కొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 40 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. వారిలో ఏడుగురికి గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది క్షతగాత్రుడు మద్దిపాడుకు చెందిన శామ్యూల్ కు ప్రథమ చికిత్స చేస్తూ ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ కు తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# టీడీపీ లెక్కలోకి కుప్పం మునిసిపాలిటీ

**కుప్పం** కుప్పం నియోజకవర్గం చంద్రబాబు నాయుడికి గుడ్ న్యూస్ ఇచ్చింది.టీడీపీ అనూహ్యంగా మున్సిపాలిటీ చైర్మన్ పదవిని దక్కించుకుంది. ఇది కూటమి శ్రేణుల్లో ఉత్సాహం నింపింది.ఓటింగ్కు ముందు జరిగిన రాజకీయ పరిణామాలు ఎవ్వరూ ఊహించలేకపోయారు. వైసీపీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు టీడీపీకి మద్దతు తెలిపారు.దీంతో పరిస్థితి ఒక్కసారిగా తారుమారైంది.అసలు ముందుగా టీడీపీకి 14 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరికి ఒక ఎమ్మెల్సీ ఓటు కూడా తోడైంది.నాలుగురు వైసీపీ సభ్యుల మద్దతుతో మొత్తం 15 ఓట్లు టీడీపీ ఖాతాలోకి వచ్చాయి.దీంతో టీడీపీ అభ్యర్థి గెలుపు ఖాయం అయ్యింది.వైసీపీకి చెందిన కేవలం 8 మంది మాత్రమే ఓటింగ్కు హాజరయ్యారు.ఇది వారికే ఎదురు దెబ్బ అయింది.కుప్పం మున్సిపల్ చైర్మన్గా సెల్వరాజు ఎంపికయ్యారు.

# కరీంనగర్ బస్టాండ్లో పోలీస్ అవుట్పోస్ట్ ప్రారంభం



**కరీంనగర్** వేసవి సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ బస్టాండ్లో చోటుచేసుకునే దొంగతనాలు మరియు ఇతర నేరాలను అరికట్టేందుకు కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు సోమవారం ఒక పోలీస్ అవుట్పోస్ట్ను ప్రారంభించింది. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఈ అవుట్పోస్ట్ను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. బస్టాండ్లో ప్రయాణికులకు ఎదురయ్యే ఇబ్బందులను తొలగించడానికి, ముఖ్యంగా దొంగతనాల నియంత్రణకు ఈ అవుట్పోస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఇప్పటికే బస్టాండ్ ఆవరణలో ఉన్న 45 సీసీ కెమెరాలను కంట్రోల్ రూమ్కు అనుసంధానం చేశామని ఆయన తెలిపారు. భవిష్యత్తులో అవసరమైన ప్రాంతాల్లో మరో 15 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరినట్లు వెల్లడించారు.ఈ పోలీస్ అవుట్పోస్ట్లో 24 గంటల పాటు పోలీసు అధికారులు మరియు సిబ్బంది అందుబాటులో ఉంటారని కమిషనర్ తెలిపారు. బస్టాండ్లో ప్రయాణికులకు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే ఈ అవుట్పోస్ట్ను సంప్రదించవచ్చని ఆయన సూచించారు. అంతేకాకుండా, జేబు దొంగల చిత్రాలను ప్రజలకు కనిపించేలా ప్రత్యేక బోర్డులపై ప్రదర్శిస్తామని ఆయన పేర్కొన్నారు.ఇటీవల కరీంనగర్ బస్టాండ్లో ప్రయాణికుల బ్యాగులు దొంగతనం చేస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారని కమిషనర్ గుర్తు చేశారు. అతని వద్ద నుంచి 150 గ్రాముల బంగారం మరియు 10 లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రయాణికులు తమ లగేజీ పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సూచించారు.ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, కరీంనగర్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, ఎస్సై రాజన్న, ఆర్టీసీ అధికారులు ఎస్ భూపతి రెడ్డి డిప్యూటీ రీజనల్ మేనేజర్, ఆపరేషన్స్, కరీంనగర్ రీజియన్, డిపో మేనేజర్లు విజయ మాధురి, శ్రీనివాస్, బస్టాండ్ ఏటీఎం జి సురేష్, కార్గో మేనేజర్ రామారావు,ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిప్పగిరి లక్ష్మీనారాయణకు
# కాంగ్రెస్ నేతల నివాళులు



**ఆళ్లగడ్డ** ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి లక్ష్మీనారాయణ దారుణ హత్య కావడంతో నంద్యాల జిల్లా డీసీసీ లక్ష్మీ నరసింహ , చిప్పగిరి లక్ష్మీనారాయణ కు నివాళులు అర్పించారు. అలాగే ఆళ్లగడ్డ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బరుగొడ్ల హుస్సేన్ భాషా, బాలు యాదవ్, కాంగ్రెస్ పార్టీ స్టేట్ మైనార్టీ సెక్రటరీ శం సుల హక్, నివాళలర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ కుటుంబానికి అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు షర్మిల హామీ ఇచ్చారు. ఆమె . ఫోన్లో ఐ లక్ష్మీనారాయణ భార్యతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషులు ప్రతి ఒక్కరు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# అమలాపురంలో వైసీపీ నేతలు కొవ్వొత్తుల ర్యాలీ..

**- ఉగ్రవాదుల చేతిలో హతమైన మృతులకు నివాళులు..**

**అమలాపురం** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో వైసీపీ నేతలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పహల్గాం ఉగ్ర దాడిలో మృతి చెందిన వారికి ఆత్మ శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ జరిగింది. అమలాపురం వైసిపి ఇంచార్జ్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో వైకాపా నిరసన ర్యాలీ చేపట్టారు. హై స్కూల్ సెంటర్ నుండి గడియార స్తంభం సెంటర్ వరకు శాంతి ర్యాలీ జరిగింది. గాంధీ విగ్రహం వద్ద మృతులకు నివాళులర్పించి పాకిస్తాన్ డాం డాం అంటూ నినాదాలు చేసారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వాళ్లకు ఆత్మ శాంతి చేకూరాలని అలాగే గాయాలపాల చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు చేసారు. ఉగ్రవాదానికి పాల్పడిన ముష్కరులను కఠినంగా శిక్షించి భారతీయులకు మనోధైర్యం కల్పించాలన్న అమలాపురం వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీకాంత్ అన్నారు.

# శ్రీవారిని దర్శించుకుని తమిళనాడుకు
# తిరిగి వెళ్తుండగా ఘోర రోడ్డు ప్రమాదం

**- ఐదుగురు మృతి**

**- ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు**

**తిరుమల** తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం తోటపల్లి వద్ద పూతలపట్టు –నాయుడుపేట జాతీయ రహదారిపై వేగంగా వెళు న్న కారు ఓ కంటైనర్ కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాద దాటికి మృతదేహాలు చెల్లాచెదురయ్యాయి. ప్రాంతమంతా భీతావహంగా మారింది.ద

గాయపడిన వారిని స్థానికులు సమీప ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటన తెలుసుకున్న పాకాల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుల్లో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు, 9 ఏళ్ల బాబు ఉన్నారు. అందరూ ఒకే కుటుంబానికి చెందిన వారిగా పోలీసులు భావిస్తున్నారు. తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరిగి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. మృతులను తమిళనాడు వాసులుగా పోలీసులు గుర్తించారు.

## చరిత్రలో నిలిచిపోయెలా
# బిఆర్ఎస్ రజతోత్సవ సభ

**- తెలంగాణ ప్రజలంతా తొలి సిఎం కేసీఆర్ వైపే.**

**- సభను విజయవంతం చేసినవారందరికి కృతజ్ఞతలు.**

**- రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్.**



**గోదావరిఖని** బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ కుంభమేళ తరహాలో జరిగిందని బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తెలంగాణ తొలి సిఎం కేసీఆర్ సభ చరిత్ర లో నిలిచిపోతుందని సభను విజయవంతం చేసినవారందరికి కృతజ్ఞతలు రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ తెలిపారు. సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఎర్పాటు చేసిన విలేఖరుల సమావేశం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా కేసీఆర్ వెంట ఉన్నారని, మొన్నటి ఎన్నికల్లో మోసపోయామని , నిన్న ఎల్కతుర్తిలో జరిగిన బిఆర్ఎస్ రజతోత్సవ సభ నిరూపించిందన్నారు. రామగుండం నియోజకవర్గం ఒక ఉద్యమాల పురిటిగడ్డగా పేరొందిందని, ఉద్యమ సమయంలో ఏ పిలుపిచ్చిన ప్రభంజనంలా తరలివచ్చిన ప్రజానీకం నిన్నటి రజతోత్సవ సభకు 5 వేల మంది జనం ఈ ప్రాంతం నుండి తరలివచ్చి విజయవంతం చేసినందుకు, వారిని సభకు తరలించడంలో కష్టించిన మాజీ ప్రజా ప్రతినిధులకు, గులాబీ సైనికులకు కృతజ్ఞతలు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని నింపిందని అన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ పీఠంపై గులాబీ జెండా ఎగురవేసే దిశగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడగడానికి వస్తే కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీసి అడగాలన్నారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన నిర్వహించిన రజతోత్సవ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆరోజే కేసీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తప్పుచేసామన్న భావనలో తెలంగాణ ప్రజానీకం ఉందని, మళ్ళీ కేసీఆర్ ను ముఖ్యమంత్రిగా చేయడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు.. ఈ విలేఖరుల సమావేశం లో నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు,గోపు ఐలయ్య యాదవ్, కుమ్మరి శ్రీనివాస్, పాముకుంట్ల భాస్కర్, కల్వచర్ల కృష్ణవేణి,బోడ్డు రవీందర్ ముద్దసాని సంధ్యారెడ్డి, నీరటి శ్రీనివాస్, నారాయణదాసు మారుతి, అచ్చే వేణు,మెతుకు దేవరాజు, నూతి తిరుపతి సట్టు శ్రీనివాస్ బుర్ర వెంకన్న ఆవునూరి వెంకటేష్ కర్రీ ఓదేలు తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రాత్మకం సులభతరం పారదర్శకమైనది భూ భారతి చట్టం

**- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

**- భూ సమస్యను క్షేత్రస్థాయిలోనే పరిష్కార మార్గం**

మహబూబాబాద్ (ప్రశ్న న్యూస్) చారిత్రాత్మకం,సులభతర పారదర్శకంమైనది, నూతన భూభారతి చట్టం 2025, సామాన్యులకు బడుగు, బలహీన వర్గాల రైతులు, ప్రజలందరికీ న్యాయమైన సత్వర సేవలు,భూ సమస్యను క్షేత్రస్థాయిలోనే పరిష్కార మార్గం చూపే భూభారతి చట్టం అన్నారు జిల్లా కలెక్టర్.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన భూభారతి చట్టం 25, అవగాహన రెవెన్యూ సదస్సు పెద్ద వంగర, తొర్రూరు మండలాల రైతు వేదికలలో, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ .వీర బ్రహ్మాచారి, రెవెన్యూ డివిజనల్ అధికారి గణేష్, తదితరులు హాజరై తెలంగాణ గీతం ఆలపించి, ఆర్డీఓ గణేష్ పిపిటి, చదివి రైతులకు, ప్రజలకు, హాజరైన వారందరికీ భూభారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం- 2025,పై అవహన కల్పించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చారిత్రాత్మకమైన సులభతరమైన సామాన్య రైతులు, ప్రజలు బడుగు బలహీన వర్గాల భూ సమస్యల పరిష్కారానికి సరికొత్త నూతన భూ భారతీ చట్టం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.గతంలో ధరణి వలన రెవెన్యూ అధికారులు సమస్యలను పరిష్కరించలేకపోయారని, సామాన్య ప్రజలు సివిల్ కోర్టు తదితర మార్గాల ద్వారా న్యాయం పొందలేక అంతవరకు వెళ్ళే స్థితిలో ఉండేవారుకాదనితద్వారా సమస్యలు అలాగే మిగిలిపోయేవి అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన భూభారతి ఆర్.ఓ.ఆర్ చట్టం- 2025 ద్వారా ప్రతి భూ సమస్యకు పరిష్కార మార్గాలు సెక్షన్ల వారిగా ఏర్పాటు చేయడం జరిగిందని తద్వారా ఏదైనా సమస్య వచ్చినప్పుడు దరఖాస్తులు స్వీకరించి ఇరు వర్గాల వారికి నోటీసులు జారీ చేసి క్షేత్రస్థాయిలోనే విచారణ చేసి సమస్యను పరిష్కరించడం కోసం తహసిల్దార్, రెవిన్యూ డివిజనల్ అధికారి, కలెక్టర్ స్థాయిలలో నిర్ణీత సమయంలో రైతుల న్యాయం జరిగేలా చట్టం రూపొందించారని, ప్రస్తుతం అన్ని స్థాయిలలో రైతులకు అప్పీల్ దరఖాస్తులు చేసుకునే అవకాశం ఈ నూతన చట్టంలో ఉందని అన్నారు. అందుకోసం ప్రభుత్వం క్షేత్రస్థాయిలో గ్రామ పరిపాలన



అధికారులను, సర్వేయర్లను నియమించడం కోసం చర్యలు తీసుకుంటుందన్నారు. తద్వారా క్షేత్రస్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకోవడం కోసం పకడ్బందీ ప్రణాళికా ప్రకారం ముందుకు సాగుతున్నామని రైతులు, ప్రజలు, అన్ని వర్గాల వారు ఈ నూతన రెవెన్యూ చట్టం పై అవగాహన పెంచుకొని వారి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.ఈ రెవెన్యూ సదస్సులో ఏడి ఎస్ఎల్ఆర్ ఏ.నరసింహ మూర్తి,స్థానిక తహసిల్దార్లు మహేందర్, శ్రీనివాస్ ఎంపిడిఓలు వేణుమాధవ్, పూర్ణచందర్ రెడ్డి, ఎడిఏ విజయ్ చంద్ర, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అర్జీలను త్వరితగతిన పరిష్కరించి సంతృప్త శాతం పెరిగేందుకు కృషి చేయాలి

**రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు**



అనకాపల్లి(ప్రశ్న న్యూస్) ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక పి.జి.అర్.ఎస్. లో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించి ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేందుకు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు అధికారులకు సూచించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.అర్.ఎస్. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, పత్యేక డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి, జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఏపీఐఐసీ మనోరమ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ఆర్జీలపై సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన వినతులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేందుకు కృషి చేయాలని తెలిపారు. ప్రజలు అందజేసిన ధరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కరించిన వినతులను ధరఖాస్తుదారునికి తెలియజేయాలని, పరిష్కారం కాని ఎడల దరఖాస్తుదారునికి అందుకుగల కారణాలను వివరించాలని అన్నారు. విభిన్న ప్రతిభావంతుల అర్జీలను ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.ఆర్.ఆర్.సి. ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి నేరుగా వారి వద్దకు వెళ్లి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి : జలాల్

**- అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే అధికారులదే బాధ్యత**

**- కక్షపూరితంగా వెన్నెల నగర్ కు అన్యాయం**



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డుల్లో ఉన్న నిరుపేదలు 807 మందికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం 75 గజాల చొప్పున ఇంటి స్థలం ఇచ్చిందని, ఆ లబ్ధిదారులకు ఎలాంటి నియమ నిబంధనలు లేకుండా ఇంటి నిర్మాణానికి ఇందిరమ్మ పథకం ద్వారా రూ.5 లక్షలు ఇవ్వాలని "సేవ్ కొత్తగూడెం- సేవ్ మున్సిపాలిటీ" కన్వీనర్ జలాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం లబ్దిదారులతో కలిసి మున్సిపాలిటీ కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీల్లో మాజీ కౌన్సిలర్ల పెత్తనం ఎక్కువైందని, వెన్నెల నగర్ కు చెందిన లబ్ధిదారులకు అన్యాయం చేయాలని కొంతమంది నాయకులు చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనర్హులకు ఇండ్లు ఇస్తే అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏ వార్డులో ఎంతమందికి ఇండ్లు వచ్చాయో సవివరంగా మున్సిపల్ నోటీసు బోర్డులో పెట్టాలని, ఇండ్ల ఎంపికలో మాజీ కౌన్సిలర్ల ప్రాధాన్యత అస్సలు ఉండకూడదని ఆయన అధికారులను కోరారు.

ఇందిరమ్మ కమిటీ సభ్యులు సైతం లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాలని లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో రామవరం ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వారికి ఎలాంటి హక్కు పత్రాలు లేకపోవడంతో ఇండ్లు మంజూరయ్యే అవకాశం కనబడడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగూడెం పట్టణంలో సైతం స్థలాలకు అతి తక్కువ మందికి పట్టాలు ఉండడంతో ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో తీవ్ర అన్యాయం జరగనున్నట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే అర్హులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక జిల్లా కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణలో చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

**పి జి ఆర్ ఎస్ మీ కోసం లో ప్రజల నుంచి 168అర్జీలు స్వీకరించాం.**

**కలెక్టర్ అరుణ్ బాబు**



పల్నాడు (ప్రశ్న న్యూస్) ప్రజా సమస్యల పరిష్కార వేది క'లో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి 168 అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో డిఆర్ఓ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరి ష్కార వేదిక లో వచ్చే ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## నైట్ అవుట్ అలవెన్స్ రూ.400 ఇవ్వాలి..

**- రిలే నిరాహార దీక్షలు చేపట్టిన ఆర్టీసీ కార్మికులు**

**- ఆర్టీసీ కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వాలి..**

**- ఎన్ఎంయు డిపో కార్యదర్శి వై.డి.ఆర్ స్వామి**

**- ఎన్ఎంయు నంద్యాల జిల్లా వైస్ ప్రెసిడెంట్ పబ్బతి సుధాకర్**



**నందికొట్కూరు** రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిపోల్లో పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికులకు వెంటనే ప్రమోషన్ ఇవ్వాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నంద్యాల జిల్లా వైస్ ప్రెసిడెంట్ పబ్బతి సుధాకర్ , డిపో కార్యదర్శి వైడిఆర్ స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక నందికొట్కూరు ఆర్టీసీ డిపో ముందు ఆర్టీసీ కార్మికులు ఎం .రామస్వామి( కండక్టర్) , డిఏ .రజాక్( కండక్టర్), డి .శేఖర్ ( డ్రైవర్), కె .రవీంద్ర కుమార్( మెకానిక్ అసిస్టెంట్) రిలే నిరాహార దీక్షలు చేపట్టారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1/2019 యధావిధిగా అమలు చేయాలని, నైట్ అవుట్ అలవెన్స్ రూ.150 నుంచి కిలోమీటర్లు బట్టి 300 నుండి 400 వరకు పాత పద్ధతిలో ఇవ్వాలన్నారు. గ్యారేజీ కార్మికులకు పనిష్మెంట్లు తగ్గించాలన్నారు. డిపోలో సస్పెన్షన్ లు ఎత్తివేయాలి అన్నారు . కార్మికులకు వెంటనే ప్రమోషన్ ఇవ్వాలన్నారు సివిల్ అసిస్టెంట్ సర్జన్ గవర్నమెంట్ వారు ఇచ్చిన సిక్కులకు జీతాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుదాస్, రత్నం జనార్ధన్ , కుమార్ , విజయుడు, గ్యారేజీ సెక్రెటరీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పవర్ ప్లాంట్ ఘటననపై స్పందించిన ఎమ్మెల్యే



**నల్గొండ** దామరచర్ల (మం) యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రమాదంపై స్పందించిన స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి స్పందించారు. ప్లాంట్ ను పరిశీలించి ప్రమాదం జరిగిన తీరుపై అధికారులతో ఆరాతీసారు. యూనిట్ వన్ లోని బాయిలర్ వద్ద గ్యాస్ కట్ ఒత్తిడికి గురై ఆయిల్ లీక్ కావడంతో మంటలు చెలరేగినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన మూడు బాయిలర్లు రన్ చేయడంలో ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. త్వరితగతన ప్రమాదానికి గురైన బాయిలర్ గ్యాస్ కట్ ను రిపేరు చేయాలని అధికారులను ఆదేశించారు ఎమ్మెల్యే. బాయిలర్ రిపేరు చేసి 24 గంటల్లోపు రన్నింగ్ లోకి తీసుకువస్తామని అధికారులు వెల్లడించారు. జరిగింది చిన్న ప్రమాదం ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే బిఎల్ఆర్ తెలిపారు.

## మే 8 నుండి 16వ తేదీ వరకు.. బూరగమంద శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు



**తిరుపతి** చిత్తూరు జిల్లా సదుం మండలం బూరగమంద గ్రామంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు మే 8 నుండి 16వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. మే 7న సాయంత్రం అంకురార్పణం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు తిరుచ్చి ఉత్సవం, రాత్రి 8 గంటలకు వాహనసేవలు జరుగనున్నాయి. మే 17వ తేదీన సాయంత్రం 5 గంటలకు పుష్పయాగం నిర్వహిస్తారు.

**బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలు :**

08-05-2025 - సాయంత్రం - ధ్వజారోహణం
09-05-2025 - సాయంత్రం - శేష వాహనం
10-05-2025 - సాయంత్రం - హంస వాహనం
11-05-2025 - సాయంత్రం - హనుమంత వాహనం
12-05-2025 - సాయంత్రం - కల్యాణోత్సవం, గరుడ వాహనం
13-05-2025 - సాయంత్రం - పుష్ప పల్లకి
14-05-2025 - సాయంత్రం - సింహ వాహనం
15-05-2025 - సాయంత్రం - అశ్వవాహనం
16-05-2025 - ఉదయం - చక్రస్నానం, సాయంత్రం - గజ వాహనం, ధ్వజావరోహణం

ఈ సందర్భంగా హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తి సంగీత కార్యక్రమం, హరికథాగానం, కోలాటాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## లోకాయుక్తా, ఉప లోకాయుక్తా ప్రమాణ స్వీకారం

**హైదరాబాద్** రాజ్ భవన్ లో తెలంగాణ రాష్ట్ర లోకయుక్త ఉప లోకాయుక్త పదవి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యాతిదిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. పాల్గొని నూతనంగా లోకయుక్తగా నియమితులైన జస్టిస్ ఏ. రాజశేఖర్ రెడ్డి. ఉప లోకాయుక్త జస్టిస్ బి ఎస్ జగ్జీవన్ కుమార్. తో( నేడే సోమవారం) ప్రమాణ స్వీకారం చేయించారు. చిత్రంలో తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి. తెలంగాణ రాష్ట్ర శాసనసభ సభపతి గడ్డం ప్రసాద్ కుమార్. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు. మహమ్మద్ అలీ షబ్బీర్. వేము నరేందర్ రెడ్డి. మంత్రులు. శాసన సభ్యులు. శాసన మండలి సభ్యులు. తదితరులు ఉన్నారు

## సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యుల కొరత తీర్చండి సార్

**- రోడ్లు, ఇతర అభివృద్ధి పనులపై కలెక్టర్ కు ఎమ్మెల్యే ఆదిమూలం వినతి**





నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో వైద్యుల కొరతను తీర్చాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు ను కోరారు.సోమవారం ఉదయం తిరుపతిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి, సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేరుకొని ఈ మేరకు కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమది ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమని, తమిళనాడు సరిహద్దుగా ఉన్న వెనుకబడిన ప్రాంతమని, ఇటువంటి ప్రాంతంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కలెక్టర్ కు వివరించారు. ఇప్పటికే ఈ ఆస్పత్రిలో గైనకాలజిస్ట్, అనస్తీషియా వైద్య నిపుణుల పోస్టు ఖాళీగా ఉందన్నారు. దీనికి తోడుగా మరో సీనియర్ డాక్టర్ ను పుత్తూరుకు బదిలీ చేయడం దారుణమన్నారు. ఈ సమస్యపై తక్షణం స్పందించి సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో ఖాళీ డాక్టర్ల పోస్టులను గుర్తించి, సరిపడా వైద్యులను నియమించి, పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఆదిమూలం కలెక్టర్ కు విన్నవించారు.

## 1మే 4 నుండి బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు



**బద్వేలు** బద్వేల్ కు కేవలం 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్రహ్మంగారిమఠంలో వెలసిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు మే 4వ తేదీ నుండి అంగరంగ వైభవంగా జరగబోతున్నాయి బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాల గురించి బ్రహ్మంగారిమఠం ఆలయ ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ తెలిపారు మే 8వ తేదీ వరకు స్వామివారి ఆరాధన మహోత్సవాలు జరుగుతాయి గతంలో కంటే ఈసారి జరగబోయే ఆరాధన మహోత్సవాలు వైభవంగా జరుగుతాయని ఆయన తెలిపారు ఆలయాన్ని ప్రస్తుతం అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పించినట్లు ఆయన తెలిపారు దూర ప్రాంతాల నుంచి బ్రహ్మంగారిమఠానికి బస్సులు ఉన్నట్లు చెప్పారు భక్తులందరూ బ్రహ్మంగారి ఆరాధన గురుపూజ మహోత్సవాలకు భారీ సంఖ్యలో రావాలని ఆయన కోరారు ఆలయ ప్రాంగణంలో చలువ పందిల్లు భోజనం వసతి ఏర్పాటు చేసినట్లు చెప్పారు కాగా మే 7 తేది బుధవారం జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సజీవ సమాధి నిష్ట వహించిన పవిత్రమైన, రోజు అని ఆరోజు స్వామివారిని దర్శించుకోవాలని కోరారు అలాగే 8 తేదీ గురువారం స్వామివారి రథోత్సవం ఉంటుందని శంకర్ బాలాజీ తెలిపారు

# 'సూపర్ బాయ్స్ ఆఫ్ మాలేగావ్'
# [అమెజాన్ ప్రైమ్] మూవీ రివ్యూ!



హిందీలో కమింగ్ ఏజ్ ఆఫ్ డ్రామా జోనర్లో రూపొందిన సినిమానే 'సూపర్ బాయ్స్ ఆఫ్ మాలేగావ్'. ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీన ఈ సినిమాను థియేటర్లకు తీసుకుని వచ్చారు. రీమా కగ్టి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆదర్శ్ గౌరవ్ ప్రధానమైన పాత్రను పోషించాడు. 2008 వచ్చిన 'సూపర్ మ్యాన్ ఆఫ్ మాలేగావ్' అనే డాక్యుమెంటరీ ఆధారంగా ఈ సినిమాను రూపొందించారు. ఈ నెల 25వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతోంది.

**కథ:** ఈ కథ 1990లలో మొదలవుతుంది. 'మాలేగావ్' అనే టౌన్లో నాసిర్ (ఆదర్శ్ గౌరవ్) వీడియోగ్రఫర్ గా పనిచేస్తూ ఉంటాడు. అలాగే వీడియో కేసెట్లు కూడా రెంట్ కి ఇస్తూ ఉంటాడు. అయితే అతనికి సినిమా డైరెక్టర్ కావాలనే ఒక కోరిక బలంగా ఉంటుంది. తండ్రి రెంట్ కి తీసుకుని నడిపిస్తున్న థియేటర్ కొన్ని కారణాల వలన మూసివేయవలసి వస్తుంది. అందుకు తానే కారణమవడం అతనికి బాధను కలిగిస్తుంది. నాసిర్ మల్లిక (రిద్ధి కుమార్)ను ప్రేమిస్తూ ఉంటాడు. ఆమెనే పెళ్లిచేసుకోవాలనుకుంటాడు. పెద్దగా చదువుకోని అతనికి మల్లికను ఇవ్వడానికి ఆమె తండ్రి ఒప్పుకోడు. ఆమెకి మరొకరితో వివాహమై పోవడంతో, జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదల అతనిలో పెరుగుతుంది. తన ఊళ్లో ఒక సినిమాను తీసి, దర్శకుడిగా తన 'కల'ను నిజం చేసుకోవాలని భావిస్తాడు. తన స్నేహితులలో నటన పట్ల .. రచన పట్ల .. సినిమాల పట్ల ఆసక్తి కలిగినవారు ఉండటం వలన, వాళ్లను కూడా కలుపుకుని ముందుకు వెళ్లాలని నిర్ణయించుకుంటాడు. నాసిర్ కి సహకరించడానికి ఫరోగ్ (వినీత్ కుమార్) షఫీక్ (శశాంక్ అరోరా) అక్రమ్ (అనూజ్ సింగ్) అంగీకరిస్తారు. అందుబాటులో ఉన్న పాత వస్తువులనే ఉపయోగించుకుంటూ, 'షోలే' సినిమా కథను స్పూఫ్ కామెడీగా తెరకెక్కిస్తారు. తమ ఊళ్లో మాత్రమే రిలీజ్ చేస్తారు. ఆ సినిమాకి మంచి రెస్పాన్స్ వస్తుంది. నాసిర్ కి డబ్బుతో పాటు పేరు వస్తుంది. అప్పుడు స్నేహితుల మధ్య ఎలాంటి మనస్పర్థలు తలెత్తుతాయి? వాటి ఫలితం ఎలా ఉంటుంది? అనేది కథ. విశ్లేషణ: జీవితంలో కష్టపడకుండా పైకి వచ్చినవారెవరూ ఉండరు. సక్సెస్ సాధించిన ప్రతి ఒక్కరిలోను ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. అయితే విజయాన్ని సాధించిన తరువాత, మూలాలు చాలా తక్కువ మందికి మాత్రమే గుర్తుంటాయి. ఆ మూలలను గుర్తుచేసుకునేవారు విజయాలను కొనసాగిస్తూ వెళతారు. మర్చిపోయినవారు ఏదో ఒక రోజున మళ్లీ వెనక్కివస్తారు. అప్పుడైనా వదిలేసినా మూలలను వెంటబెట్టుకుని వెళ్లమనే కాలం చెబుతూ ఉంటుంది. ఇలాంటి ఒక విషయాన్ని సందేశాత్మకంగా రూపొందించిన సినిమానే ఇది. డబ్బు .. పేరు ఈ రెండూ కూడా, అప్పటివరకూ కలిసి ప్రయాణం చేసినవారి నుంచి వేరు చేస్తాయి. విజయాన్ని సాధించినవారు అహంభావంతో తనవారికి దూరమైతే, ఆ విజయానికి అసూయ చెందినవారు తమంతట తాముగా దూరమవుతూ ఉంటారు. ఎవరి స్థాయిని వారు తెలుసుకుని .. ఎవరి టాలెంట్ ను వారు గుర్తించడంలోనే నిజమైన సక్సెస్ ఉంటుందని నిరూపించిన కంటెంట్ ఇది. పనితీరు: దర్శకుడు ప్రధానమైన పాత్రలను తీర్చిదిద్దిన తీరు బాగుంది. సహజత్వానికి చాలా దగ్గరగా ఆయన ఈ పాత్రలను తీసుకుని వెళ్లగలిగాడు. స్నేహితుల మధ్య మనస్పర్థలు .. గొడవలు .. రాజీలు మొదలైన సన్నివేశాలు కంటెంట్ ను మరింత వేగంగా ఆడియన్స్ కి కనెక్ట్ చేస్తాయి. యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిన కథ కావడం వలన, మన కళ్లముందు జరుగుతున్నట్టుగానే అనిపిస్తుంది. ప్రధానమైన పాత్రలను పోషించిన ఆర్టిస్టులంతా తమ పాత్రలకు జీవం పోశారు. స్వప్నిల్ ఫొటోగ్రఫీ .. సచిన్ – జిగర్ సంగీతం .. ఆనంద్ ఎడిటింగ్ కథకు తగినట్టుగానే కనిపిస్తాయి.

**ముగింపు:** విజయం వలన పేదరికం దూరం కావాలి .. అప్పటివరకూ ఉన్న అనుబంధాలు కావు. ఒకవేళ అలాంటి పరిస్థితులు తలెత్తితే, సామరస్యంతో పరిష్కరించుకోవాలి. విజయం వలన తలెత్తే అహంభావానికి వినయానికి మించిన విరుగుడు లేదు అనే సందేశాన్ని అందించే సినిమా ఇది. 1990లలో మొదలయ్యే కథ .. స్ఫూర్తిని కలిగించే కథ కావడం వలన ఓ లుక్కు వేయవచ్చు.

# 'జువెల్ తీఫ్' (నెట్ ఫ్లిక్స్) మూవీ రివ్యూ!



బాలీవుడ్లో యాక్షన్ థ్రిల్లర్ సినిమాల జోరు ఎక్కువ. ఈ జోనర్ నుంచి రీసెంటుగా 'నెట్ ఫ్లిక్స్'కి వచ్చిన సినిమానే 'జువెల్ తీఫ్'. సైఫ్ అలీఖాన్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమా, థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీకి వచ్చింది. ఈ నెల 25వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. కుకీ గులాటీ .. రాబీ గ్రేవాల్ దర్శకత్వం వహించిన ఈ సినిమాకి, సిద్ధార్థ్ ఆనంద్ – మమతా ఆనంద్ నిర్మాతలుగా వ్యవహరించారు. కథ: రెహాన్ రాయ్ (సైఫ్ అలీఖాన్) కుటుంబ సంబంధమైన కొన్ని కారణాల వలన గజదొంగగా మారతాడు. నిజాయితీపరుడైన తండ్రితో గెంటివేయబడిన కారణంగా కుటుంబానికి దూరంగా ఉంటూ ఉంటాడు. విదేశాలలో ఉంటున్న అతణ్ణి రాజన్ ( జైదీప్ అహ్లావత్) ఇండియాకి రప్పిస్తాడు. 'రెడ్ సన్' అనే డైమండ్ ను దొంగిలించి తనకి అప్పగించవలసిన బాధ్యతను రెహాన్ కి అప్పగిస్తాడు. 'రెడ్ సన్' .. ఆఫ్రికకి చెందిన అత్యంత ఖరీదైన వజ్రం. దాని విలువ 500 కోట్లకి పైన ఉంటుంది. 18 వ శతాబ్దం నుంచి ఆ డైమండ్ ను రాజవంశీకులు కాపాడుతూ వస్తుంటారు. ఆ డైమండ్ కొన్ని రోజుల పాటు 'ముంబై'లోని మ్యూజియంలో ఉండనుంది. ఆ బిల్డింగ్ లో నుంచి ఆ డైమండ్ ను కాజేయాలని రాజన్ చెబుతాడు. తన ఫ్యామిలీ రాజన్ కారణంగా ప్రమాదంలో ఉందని తెలుసుకున్న రెహాన్ అందుకు అంగీకరిస్తాడు. అయితే అందులో సగం వాటా తనకి దక్కాల్సి ఉంటుందని చెబుతాడు. ముంబైకి చేరుకున్న ఆ డైమండ్ ను కాజేయడానికి రెహాన్ ప్లాన్ సిద్ధం చేసుకుంటాడు. తాను ఎలా ఆ డైమండ్ ను కాజేయనున్నది రాజన్ కి చెబుతాడు. చాలా రోజులుగా రెహాన్ ను అరెస్టు చేయాలనే పట్టుదలతో అతనిని గాలిస్తూ ఉన్న పోలీస్ ఆఫీసర్ విక్రమ్, డైమండ్ దొంగతాన్ని ముందుగానే పసిగడతాడు. అది తెలియని రెహాన్, తాను వేసిన ప్లాన్ ప్రకారం ఆ బిల్డింగ్ లోకి అడుగుపెడతాడు. అక్కడ ఏం జరుగుతుంది? అతనికి ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? అనేది మిగతా కథ. విశ్లేషణ: వందల కోట్ల ఖరీదు చేసే డైమండ్, కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉంటుంది. అంతర్జాతీయ స్థాయిలో ఆ డైమండ్ చేతులు మారవలసి ఉంటుంది. ఇక్కడి డాన్ ఆ పనిని హీరోకి అప్పగిస్తాడు. హీరో ఆ పనిని ఎలా చేస్తాడు? ఈ విషయంలో తనకి ఎదురైన అవాంతరాలను ఎలా అధిగమిస్తాడు? అనే టెన్షన్ ను ఆడియన్స్ లో రేకెత్తిస్తూ సాగే కంటెంట్ ఇది. గతంలో ఈ తరహా సినిమాలు చాలానే వచ్చాయి గదా. ఇందులో ఏదో కొత్తదనం ఉండే ఉంటుంది. కొత్త పాయింట్ లేకుండా పాత కథనే పట్టుకుని వస్తారా? కథలో ఎక్కడో ఓ మలుపు .. ఓ మెలిక ఉండే ఉంటాయి. లేకపోతే ఈ స్థాయిలో ఖర్చు పెడతారా? అని అనుకోవడం సహజం. అయితే కొన్ని సినిమాలను చూస్తూ, పాత సినిమాలను గుర్తుచేసుకోకూడదు. 'గతం గతః' అనుకుంటేనే తప్ప ఈ కథను ఫాలో కాలేము. అటు చరిత్ర .. ఇటు ఖరీదు కలిగిన డైమండ్ ను కొట్టేయడానికి హీరో వేసే ప్లాన్ .. తప్పించుకునే తీరు ఆడియన్స్ లో ఆసక్తిని రేకెత్తించే అసలైన అంశాలు. ఇటు తనని తాను కాపాడుకోవడం .. అటు ఫ్యామిలీని హీరో సేవ్ చేయడం, యాక్షన్ కీ .. ఎమోషన్స్ కి మధ్య లో ఘాటైన రొమాన్స్ ను ఆడియన్స్ ఆశిస్తారు. కానీ వీటన్నిటికీ దూరంగా ఈ కథ నడుస్తుంది. అది కూడా నిదానంగా .. నింపాదిగా.. నీరసంగా. పనితనం: దర్శకుడు ఎంచుకున్న ఈ కథలో బడ్జెట్ కనిపిస్తుంది .. భారీతనం కనిపిస్తుంది. కానీ కనుచూపు మేరలో కొత్తదనం మాత్రం కనిపించదు. లవ్ .. రొమాన్స్ కి తగిన సమయం హీరోకిలేదు. అలాంటప్పుడు యాక్షన్ సన్నివేశాలు ఒక రేంజ్ లో ఉండేలా డిజైన్ చేసుకోవాలి. అలాగే ఎమోషన్స్ బలంగా ఉండేలా చూసుకోవాలి. ఆ విషయాలను అంతగా పట్టించుకోక పోవడం నిరాశను కలిగిస్తుంది. సైఫ్ అలీ ఖాన్ – జైదీప్ అహ్లావత్ .. పాత్రలపైనే పూర్తి ఫోకస్ పెట్టారు. పోలీస్ ఆఫీసర్ పాత్ర కాస్త హడావిడి చేస్తుంది అంతే. పాత్రలను డిఫరెంట్ గా డిజైన్ చేయకపోవడం వలన, వాటికి కనెక్ట్ కావడానికి ఆడియన్స్ నానా కష్టాలు పడవలసి వస్తుంది. జిష్ణు ఫొటోగ్రఫీ .. సచిన్ – జిగర్ సంగీతం .. ఆరీఫ్ షేక్ ఎడిటింగ్ ఫరవాలేదు. ముగింపు: సాధారణంగా భారీ యాక్షన్ థ్రిల్లర్ సినిమాల నుంచి ఒక రేంజ్ యాక్షన్ ను .. బలమైన ఎమోషన్స్ ను ఆడియన్స్ ఆశిస్తారు. హీరో చేసే సాహసోపేతమైన పనులు .. వీరోచిత విన్యాసాలను ఊహించుకుంటారు. అలాంటి ఉత్సాహంతో టీవీ ముందు కూర్చున్న ప్రేక్షకులను ఏ మాత్రం థ్రిల్ చేయలేకపోయిన సినిమా ఇది.



# వింక్ బ్యూటీకి మళ్లీ పెరుగుతున్న క్రేజ్..
## – ఒక్కసారిగా ట్రెండింగ్‌లోకి వచ్చేసిందిగా..!

మలయాళీ ముద్దుగుమ్మ ప్రియా ప్రకాశ్ వారియర్ ఒకప్పుడు సోషల్ మీడియాని షేక్ చేసింది. ఒరు ఆదార్ లవ్ సినిమాలోని కన్ను గీటే సన్నివేశంతో ఓవర్ నైట్ స్టార్‌డం అందిపుచ్చుకుంది. ఆ ఒక్క కన్నుగీటుతోనే పాన్ ఇండియా గుర్తింపు దక్కించుకుంది ప్రియా ప్రకాశ్ వారియర్. ఆ తర్వాత పలు సినిమాలలో నటించింది. అయితే 2018లో గూగుల్‌లో ఎక్కువగా వెతికిన సెలబ్రిటీగా పేరు తెచ్చుకుంది ప్రియా వారియర్. అంతేకాదు ఒక్క రోజులో 6 లక్షల మందికి పైగా ఫాలో అయిన ఏకైక నటిగా రికార్డు సృష్టించింది ప్రియా వారియర్. తెలుగు, తమిళం, హిందీ భాషలలో హీరోయిన్‌గా పలు సినిమాల్లో నటించినా పెద్దగా సక్సెస్‌లు దక్కించుకోలేక పోతున్న ఈ అమ్మడు ఇటీవల తమిళ్ స్టార్ హీరో అజిత్ నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలో గెస్ట్ రోల్ పోషించింది. అలానే ఐటెం సాంగ్‌లోను కనిపించి తన డ్యాన్స్‌తో అదరగొట్టింది. సినిమాలో కనిపించింది కొద్ది సమయం అయినా కూడా ప్రియా ప్రకాశ్‌కి మాత్రం మంచి గుర్తింపు లభించింది. ఈ సినిమాలో ప్రియా ప్రకాశ్ వారియర్ నిత్య పాత్రలో నటించగా, ఆమె 'తొట్టు తొట్టు' పాటలో అదిరిపోయే డ్యాన్స్ చేసింది. ఆమె డ్యాన్స్‌కు ఆడియన్స్ ఫిదా అవుతున్నారు. ఈ సాంగ్‌లో స్టెప్పులు కన్ను గీటడానికి మించి వైరల్ అవుతున్నాయి. తాను ఎంతగానే అభిమానించే అజిత్ చిత్రంలో భాగం కావడాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని ప్రియా ప్రకాశ్ చెప్పుకొచ్చింది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమా తర్వాత ప్రియా ప్రకాష్ వారియర్‌కి మరిన్ని ఆఫర్లు తెచ్చి పెట్టే అవకాశాలు ఉన్నాయని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అజిత్ గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమా బాక్సాఫీస్ దగ్గర దాదాపుగా రూ.200 కోట్ల వసూళ్లు సాధించినట్లు సమాచారం అందుతోంది. ఆ స్థాయి వసూళ్లు నమోదు కావడంతో మాత్రమే కాకుండా సినిమాలో ఆమె పాత్రకు, ఆమె ఐటెం సాంగ్‌కి మంచి గుర్తింపు దక్కిందని ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. చాలా మంది ఈ పాటను షార్ట్ వీడియో లేదంటే రీల్స్‌గా షేర్ చేస్తున్నారు. తద్వార ప్రియా ప్రకాష్ వారియర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది

# పెళ్లెప్పుడో చెప్పిన విశ్వక్ సేన్..



టాలీవుడ్ యంగ్ హీరో విశ్వక్ సేన్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. ఇతనిని చూస్తే యాటిట్యూడ్ ఎక్కువ అని చాలా మంది అనుకుంటారు. పలు వివాదాలలో కూడా విశ్వక్ యాటిట్యూడ్ చూపించాడు అని కొందరు చెప్పుకొస్తుంటారు. అయితే మంచి టాలెంట్ ఉన్న విశ్వక్ సేన్ ఎందుకో సూపర్ హిట్స్ అందుకోలేకపోతున్నాడు. చివరిగా 'లైలా' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఘోర పరాజయం పొందింది. ఈ సినిమా కోసం విశ్వక్ సేన్ చాలా కష్టపడ్డాడు. ప్రమోషన్స్ కూడా గట్టిగానే చేశాడు. అయిన ఫలితం మారలేదు. ఈ సారి మాత్రం గట్టి హిట్ కొట్టాలనే కసి మీద ఉన్నాడు. లైలా సినిమా ఫెయిల్యూర్ తర్వాత విశ్వక్ సేన్ పెద్దగా కనిపించింది లేదు. తాజాగా నేచురల్ స్టార్ నాని నటించిన 'హిట్ 3' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి హజరై అదిరిపోయే స్పీచ్ ఇచ్చాడు. హిట్ ఫ్రాంచైజీ ఫస్ట్ పార్ట్‌లో విశ్వక్ సేన్ నటించిన నేపథ్యంలో హిట్ 3 ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ఆహ్వానించారు. ఆయన్ను సుమ సరదాగా ఇంటరాగేషన్ చేశారు. ఆఫీసర్‌నే ఇంటరాగేషన్ చేస్తారా? అంటూ సుమను ప్రశ్నించాడు విశ్వక్.. ఇప్పుడు ఆఫీసర్ అర్జున్ సర్కార్ కదా.. అని సుమ అనడంతో దీనికి 'మా తెలంగాణ బ్రాంచ్‌లో నేనే కదా ఆఫీసర్‌ను' అని విశ్వక్ సరదాగా కామెంట్ చేశారు. 'అర్జున్ సర్కార్, విక్రమ్‌లో లేని క్వాలిటీ ఏంటి అని మీరు అనుకుంటున్నారు.' అన్న ప్రశ్నకు విశ్వక్.. 'ఫిట్టింగ్ ఇది. ఇద్దరిలో ఉండే ప్రశాంతత. కామ్ నెస్ అంటూ సమాధానం ఇచ్చారు. ఈ మధ్యే నా వయస్సు 30కి చేరుకుందని , ఇప్పుడు కాస్త స్పీడ్ తగ్గించి కూల్ గా ఉండేందుకు ప్రయత్నిస్తున్నాను. ఊరికే అటు ఇటు పరిగెడుతూ ఉన్నా.. ఇప్పటి నుంచి అది తగ్గిపోతుందని అని చెప్పారు. నాని, అడివి శేష్ నుంచి కూల్ గా ఉండటం నేర్చుకుంటున్నాను అని చెప్పారు. ఇక మీరు పెళ్లెప్పుడు చేసుకోవాలనుకుంటున్నారు?' అని సుమ అడగ్గా.. మా అమ్మకు సంబంధాలు చూడమని మొన్ననే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాను. సో.. ఎప్పుడు దొరికితే అప్పుడు చేసుకుంటాను అని విశ్వక్ చెప్పడంతో త్వరలో మనోడు కూడా పప్పు అన్నం పెట్టించబోతున్నాడని ఫ్యాన్స్ సంబరపడిపోతున్నారు.

# సినిమా కోసం చేశా..
# మీరు అనుకరించొద్దు ప్లీజ్: సూర్య



తన తదుపరి చిత్రం 'రెట్రో'లో కొన్ని సన్నివేశాల్లో ధూమపానం చేసినప్పటికీ, నిజ జీవితంలో ఆ అలవాటుకు దూరంగా ఉండాలని నటుడు సూర్య తన అభిమానులకు గట్టిగా సూచించారు. తిరువనంతపురంలోని లులూ మాల్‌లో జరిగిన 'రెట్రో' ప్రీ–రిలీజ్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "ఒక చిన్న హెచ్చరిక. నేను కేవలం సినిమా అవసరం కోసమే సిగరెట్లు కాల్చాను. దయచేసి మీ నిజ జీవితంలో ఎవరూ పొగతాగకండి" అని సూర్య స్పష్టం చేశారు. పొగతాగడం ఒకసారి మొదలుపెడితే సులభంగా వదిలించుకోలేని వ్యసనంగా మారుతుందని ఆయన హెచ్చరించారు. "ఒక్క పఫ్ లేదా ఒక్క సిగరెట్‌తో మొదలుపెడతారు. కానీ ప్రారంభించాక దాన్ని ఆపడం చాలా కష్టం. నేను దీన్ని కచ్చితంగా ప్రోత్సహించను, మీరు కూడా చేయకండి" అని ఆయన హితవు పలికారు. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ 'రెట్రో' చిత్రం, తాను గతంలో చేసిన 45 సినిమాలకు భిన్నంగా ఉంటుందని సూర్య తెలిపారు. కార్తీక్‌తో మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ చిత్రంలో సూర్యతో పాటు పూజా హెగ్డే, మలయాళ నటులు జోజు జార్జ్, జయరామ్ తదితరులు నటిస్తున్నారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు.

# ఉపాధి కూలీలను శ్రమదోపిడికి గురి చేస్తున్న ప్రభుత్వాలు.

**బూడిద గణేష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి**



మంథని ( ప్రశ్న న్యూస్) వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంథని మండలం తోట గోపయ్య పల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ పనులను సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ. వేసవి కాలంలో కూలీలు ఎండలో మూడు కిలోమీటర్లు కాలినడకన నడిచి వెళ్లి అడవి ప్రాంతంలో ఉపాధి హామీ పనులు చేస్తున్నారని ఈ సందర్భంగా అన్నారు. ఇంత దూరం ఎర్రటి ఎండలో కాలినడకన వచ్చి పనిచేసిన కూలి గిట్టుబాటు కావడం లేదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీలను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయని విమర్శించారు.వారం వారం ప్లే స్లిప్పులు వేతనాలు విడుదల చేసి సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.అనంతరం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు కన్వీనర్ గా తోట వెంకటేశం సభ్యులుగా రమేష్ రెడ్డి మల్లయ్య సాయికుమార్ శ్రీను తదితరులను ఎన్నుకున్నారు

# సామాజిక సేవా రంగంలో ఉగాది 2025 జాతీయ పురస్కారం.

## మానవత వెలుగు అవార్డు గ్రహీత ధార మధు.

మంథని ( ప్రశ్న న్యూస్) రామగుండం కార్పొరేషన్ లోని గోదావరిఖని మార్కండేయ కాలనిలో ఆదిత్య రేసిడెన్సి బ్యాంకేట్ హాల్లో, వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రలలోని పలు రంగాల వారికి ఆదివారం సాయంత్రం 2025 ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం జరిగినది. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం, ఇద్దులాపూర్ గ్రామంకు చెందిన తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ టి జి పి ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర నిజ నిర్ధారణ కమిటి కన్వీనర్ మరియు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ దార మొండయ్య (మధు కు) జాతీయ పురస్కారాల మహోత్సవ సన్మాన పత్రం మరియు సామాజిక సేవా రంగంలో జాతీయ గౌరవ పురస్కారం మానవత వెలుగు అవార్డు తో సత్కరించడం జరిగింది. సేవా రంగంలో కృషి చేసినందుకు ధార మధు ని హృదయ పూర్వకంగా అభినందిస్తు, ఈ కృషి నిరంతరం కొనసాగాలని ఇంకా ఎన్నో అద్భుతాలను ఆకాంక్షిస్తు, విజయాలను సాధించాలని అన్నారు. కార్యక్రమానికి గోదావరిఖని వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి, వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్ సురభి శ్రీధర్, గౌరవ అధ్యక్షులు పెద్దంపేట శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి లయన్ డాక్టర్ సిహెచ్ కిషన్ రావు, సలహాదారులు లయన్ డాక్టర్, కె రాజేందర్, సంస్థ జిల్లా అధ్యక్షులు డాక్టర్ తూము నర్సయ్య, స్త్రీ వైద్యురాలు లయన్ డాక్టర్ లక్ష్మి వాణి లు హాజరై అవార్డులను ప్రధానం చేయడం జరిగింది. అనంతరం సంస్థ బాధ్యులు మాట్లాడుతూ వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ గత 16 సంవత్సరాలుగా దాతల సహకారంతో ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలను చేస్తు రావడం జరిగిందని తెలిపారు.



# అన్ని వర్గాల్లో ఉత్సాహం నింపిన కేసీఆర్ స్పీచ్...

**స్వచ్ఛందంగా తరలివచ్చి సభను సక్సెస్ చేసిండ్లు**

**సభ సక్సెస్ కు కృషిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు**

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్**



మంథని ( ప్రశ్న న్యూస్) తెలంగాణ సాధన కోసం ఆవిర్భవించిన టిఆర్ఎస్ పార్టీ 24 సంవత్సరాలు పూర్తి చేసుకుని 25వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో నిర్వహించిన రజతోత్సవ సభలో మాజీ ముఖ్యమంత్రి టిఆర్ఎస్ అధినేత కేసిఆర్ స్పీచ్ ప్రజల్లో ఉత్సాహం నింపిందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అన్నారు రజతోత్సవ సభకు ఎన్ని అడ్డంకులు పెట్టిన మంథని నియోజకవర్గం లోని కమాన్ పూర్, రామగిరి, ముత్తారం, మంథని, మల్హర్, కాటారం, మహాముత్తారం, మహదేవ్ పూర్, పలిమేల మండలాల నుంచి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, కర్షకులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఆటో డ్రైవర్లు మరియు వివిధ వర్గాలకు చెందిన వారు స్వచ్ఛందంగా తరలివచ్చి సక్సెస్ చేసినందుకు ఆయన ధన్యవాదములు తెలియజేశారు,గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలను కార్యకర్తలను అభిమానులను సభకు తీసుకువెళ్లి సభా సక్సెస్ కు కృషిచేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు రజతోత్సవ సభలో కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాటను అర్థం చేసుకోవాలని ఆయన స్పూర్తితోనే ముందడుగు వేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో జరిగిన భీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివచ్చిన కార్మికులు కర్షకులు మేధావులు పార్టీ శ్రేణులు అన్ని వర్గాల ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు

# "“మేడే” ను దీక్ష దినంగా నిర్వహించాలి.



మంథని (ప్రశ్న న్యూస్) ప్రపంచ కార్మిక దినోత్సవం మె1న మేడే నిర్వహించాలని కరపత్రాలను ఈరోజు ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో ఆవిష్కరించారు. అనంతరం ముత్తారం సిఐటియు మండల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, సీపెల్లి రవీందర్,జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ లు మాట్లాడుతూ రోజుకు 18 గంటలు పని చేసే విధానాన్ని వ్యతిరేకిస్తూ రోజుకు 8 గంటల పని దినం కోసం,1886 సంవత్సరంలో అమెరికా దేశంలో, చికాగో నగరంలో, హె మార్కెట్ వద్ద సమ్మెలో భాగంగా ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులపై అక్కడి ప్రభుత్వ పోలీస్ యంత్రాంగం కాల్పులు జరపడంతో అనేక మంది కార్మిక నాయకులు అమరులయ్యారని, ఆ రక్తం మడుగులో తడిసిన కార్మికుని అంగిని పైకి ఎగరేయడంతో అదే ఎర్రజెండా గా ఆవిర్భవించిందని అన్నారు. అక్కడ ఎగిరిన ఎర్ర జెండా ప్రపంచవ్యాప్తంగా కార్మిక హక్కుల,సౌకర్యాల, చట్టాల సాధన కోసం అనేక పోరాటాలు నిర్వహించి కష్టజీవులకు అండగా ఉందని అన్నారు. అందుకే మేడేను ఉత్సవంగా కాకుండా పోరాట దినంగా నిర్వహించాలని అన్నారు.చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం జరిగిన పోరాట స్ఫూర్తితో అనేక దేశాల్లో కార్మిక వర్గం ఎర్ర జెండా అండతో తిరుగుబాటు చేసిందని, భారత దేశంలో కార్మిక వర్గం స్వాతంత్యానికి ముందు, తర్వాత అనేక పోరాటాలు, సమ్మెలు, త్యాగాలు, ఉద్యమాలు నిర్వహించి 29 కార్మిక చట్టాలను సాధించిందని అన్నారు. మే డే రోజున ప్రతి గ్రామ వార్డు బస్తి స్థాయిలో మేడే జెండాలు ఆవిష్కరించాలని, మండల, పట్టణ కేంద్రాల్లో ప్రదర్శనలు సభలు నిర్వహించి, చికాగో అమరుల స్ఫూర్తితో వర్గ పోరాటాలకు సన్నద్ధం కావాలని, ఎర్రజెండా ఔన్నత్యాన్ని ప్రతిబింబించే విధంగా మేడే నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు గజ్జెల రాజకుమార్, వెంకటేష్, నాయకులు నాదం, శ్రీనివాస్, దుర్గయ్య, నరేష్, రవి, మల్లేష్, నాయకులు. తదితరులు పాల్గొన్నారు.

# పహల్గాం ఉగ్ర దాడినికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ




మేడ్చల్ (ప్రశ్న న్యూస్) జమ్మూ కాశ్మీర్ లో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతున్న పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి 28 మంది పర్యాటకులను పొట్టనబెట్టుకున్న తీవ్రవాదుల దుశ్చర్యను నిరసిస్తూ మేడ్చల్ మున్సిపల్ 14వ వార్డ్ మాజీ కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాంలోని బైసరన్ ప్రాంతంలో ముష్కరుల ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి దేశ పౌరులందరూ నివాళులు అర్పిస్తూ మృతి చెందిన వారి కుటుంబాలకు బాసటగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇంతటి దారుణానికి పాల్పడిన కిరాతకులను పట్టుకుని కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేశారు. పహల్గాం దాడికి పాల్పడిన వారిని పట్టుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. ఉగ్రవాద సంస్థలను ప్రభుత్వం గుర్తించి అంతమొందించాలని విజ్ఞప్తి చేశారు. దేశ ప్రజలందరం ఐకమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. దారుణమైన నేరాలకు పాల్పడుతున్న ముష్కరులు దేశానికి శత్రువులన్నారు. ఈ దుఃఖ సమయంలో ఉగ్రవాద, ఛాందసవాద శక్తులకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ కాశ్మీర్ ప్రజలకు బాసటగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలాజీ నగర్, ఎం.ఆర్ కాలనీ, వాసులతోపాటు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మూల స్వాతి గౌడ్ ను ఘనంగా సన్మానించి మెమెంటో అందజేసినారు



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని బార్ అసోసియేషన్ లో మూల స్వాతి గౌడ్ కి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. తదనంతరం బార్ అసోసియేషన్ తరపున మూల స్వాతి గౌడ్ ని ఘనంగా సన్మానించి, బార్ అసోసియేషన్ తరపున ఒక చిన్న మోమంటో బహుమతిగా అందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో సీనియర్ సివిల్ జడ్జ్ భవాని మేడం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.వి.ఎల్.ఎన్ హరిబాబు, జనరల్ సెక్రెటరీ ఎం. సయేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కె. రగోతం రెడ్డి అలాగే ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యులు సీనియర్ న్యాయవాదులు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

# నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన రమేష్ బాబు

- మాజీ ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన శిలాఫలకాలను వెంటనే తొలగించాలి
- యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షులు : న్యాత నవీన్
- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



వేములవాడ,(ప్రశ్న న్యూస్) తప్పుడు పత్రాలతో ఎమ్మెల్యేగా ఎన్నికైన వేములవాడ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు ఏర్పాటు చేసిన శిలాఫలకాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ, యూత్ కాంగ్రెస్ వేములవాడ నియోజకవర్గం అధ్యక్షులు న్యాత నవీన్ ఆధ్వర్యంలో సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యాత నవీన్ మాట్లాడుతూ,రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా, ఎన్నికల నియమాలను ధిక్కరిస్తూ లక్షలాది వేములవాడ నియోజకవర్గం ప్రజలను మోసం చేసిన రమేష్ బాబు ప్రజాధనాన్ని ప్రభుత్వ ఖజానాను వినియోగించి, తన వ్యక్తిగత ప్రచారానికి ఉపయోగించారని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను నాశనం చేసే విధంగా, ప్రభుత్వ ఖర్చులతో తన పేరుతో శిలాఫలకాలు ఏర్పాటు చేయడం దుర్మార్గమన్నారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఇప్పటికే చెన్నమనేని రమేష్ బాబును డిసెంబర్ 9, 2024 న భారత పౌరసత్వం రద్దు చేసినట్లు నిర్ధారించిందని, జర్మన్ పౌరసత్వం కలిగిన రమేష్ బాబు ప్రస్తుతం క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్నారని గుర్తు చేశారు. అలాగే, హైకోర్టు తీర్పు మేరకు ఆయన ప్రస్తుత వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్‌కు రూ. 25 లక్షల పరిహారం చెల్లించేందుకు, మిగతా రూ. 5 లక్షలను తెలంగాణ లీగల్ సర్వీసెస్‌కు అప్పగించేందుకు ఆదేశించిందని గుర్తు చేశారు..అందువల్ల రమేష్ బాబు పాలన కాలంలో ఏర్పాటు చేసిన అన్ని శిలాఫలకాలను వెంటనే తొలగించి, రాజ్యాంగ విలువలను కాపాడాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ కౌడగాని వెంకటేష్, కోనరావుపేట మండల అధ్యక్షులు బండి ప్రభాకర్, టౌన్ ఉపాధ్యక్షుడు బొమ్మ తిరుపతి, గోపి గౌడ్, అక్కి సునీల్, ఇర్ఫాన్ షేక్, దయ్యాల జాన్, దినేష్ గౌడ్, అరుణ్, వినయ్, జాన్ తదితర యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.




# శాంతి భద్రతలు కాపాడటంలో సీఐ వీరప్రసాద్ సేవలు ప్రశంసనీయం

- సీఐ వీరప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు...! ఘన సన్మానం...!!
- సీనియర్ జర్నలిస్టు : వొడ్యాల వేణు



వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వీరప్రసాద్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేములవాడ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు వొడ్యాల వేణు మర్యాద పూర్వకంగా వీరప్రసాద్‌ను కలిసి,మిఠాయిలు అందజేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వొడ్యాల వేణు మాట్లాడుతూ, "సమాజంలో శాంతి భద్రతలను కాపాడటంలో వీరప్రసాద్ సేవలు ప్రశంసనీయమైనవి, ఆయన వేములవాడ పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే పట్టణ ప్రజలతో మమేకమై, అనతి కాలంలోనే అత్యంత ప్రజాదరణ పొంది ఉత్తమ అధికారిగా రాణిస్తున్న భగవంతుడు నేపథ్యంలో ఆయురారోగ్యాలతో ఆయనకు దీర్ఘాయువు ప్రసాదించాలని,మున్ముందు మరిన్ని ఉన్నత అధికార బాధ్యతలు స్వీకరించాలని కోరుకుంటున్నాను.ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నానని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# విజయ పథంలో బీఆర్ఎస్...! మీ ఆదరణకు కృతజ్ఞతలు...!!

- రజతోత్సవ విజయాన్ని చాటిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు
- బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి
- చల్మెడ లక్ష్మీనరసింహారావు



వేములవాడ,(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో కనీవినీ ఎరుగని స్థాయిలో, వరంగల్ ఎల్కతుర్తి ఎక్స్ రోడ్డు వద్ద ఆదివారం నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ 25వ రజతోత్సవ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి చల్మడ లక్ష్మీ నరసింహారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గం నుండి ప్రతీ మండలం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, తెలంగాణ ఉద్యమకారులకు, పార్టీ సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు,ఈ సభలో పాల్గొన్న భారీ జన సందోహం, బిఆర్ఎస్ పార్టీపై ప్రజల్లో ఉన్న విశ్వాసానికి,అభిమానానికి నిదర్శనంగా నిలిచింది.తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల అభివృద్ధి పరిపాలన, చేపట్టిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచినట్లు ఈ జనప్రవాహం స్పష్టం చేసింది.రానున్న రోజుల్లో కూడా పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజాసమస్యలపై పాలకులను నిలదీస్తూ, ముందుకు సాగాలన్న నా ఆకాంక్షను పునరుద్ఘాటిస్తూ, మీ ఆదరణ, ప్రేమ మరింత పెరగాలని కోరుకుంటున్నాను.మరొక్కసారి ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియకేస్తున్నానని లక్ష్మీ నరసింహారావు తెలిపారు.

# కటీల్ దుర్గాపరమేశ్వరి ఆలయ సందర్శన చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ,(ప్రశ్న న్యూస్) కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరు నగరం నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రసిద్ధ కటీల్ దుర్గాపరమేశ్వరి ఆలయాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం సందర్శించారు. ఆలయ ఈఓ కె. వినోద్, ఆర్కిటెక్ట్, స్థపతి, ఇంజనీరింగ్ అధికారుల తో కలిసి ఆయన ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న పూజా కార్యక్రమాలు, అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకున్నారు.

# ప్రకృతి సంపదపై "మట్టి మాఫియా" దాడి

- మధ్య మానేరు జలాశయం అడుగంటి పోవడంతో మట్టి మాఫియా దోపిడి
- మానేరు కింద మాఫియాల మాయ, అధికారుల మౌన అనుమతి.?
- తక్షణమే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకొని అక్రమ మట్టి రవాణాను అరికట్టాలి
- అధికారుల అవినీతిపై మండల ప్రజల ఆగ్రహం





**బోయినిపల్లి(ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో అవినీతి అక్రమాలు రాజమేలుతున్నాయి. మార్పు రావాలన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారుల అవినీతిలో మార్పు తీసుకురావడంలో పూర్తిగా విఫలం చెందుతుంది. ఎక్కడ చూస్తే అక్కడ మాఫియాలు తెగ ఎగబడుతున్నాయి. ఒకపక్క గ్రానైట్ మాఫియా, మరోపక్క మట్టి మాఫియా, ఇసుక మాఫియా, రేషన్ మాఫియా ఇలా మాఫియా ల జోరు సాగుతోంది.రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, కొదురుపాక మధ్య మానేరు జలాశయం పూర్తిగా అడుగంటి పోవడంతో, మట్టి మాఫియా కార్యకలాపాలు మళ్లీ ఊపందుకున్నాయి. స్థానిక కొందరి ప్రజల సమాచారం మేరకు, కొందరు గుర్తు తెలియని మట్టి మాఫియా గుంపులు సంబంధిత శాఖ అధికారులతో కుమ్మక్కై ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తూ భారీగా ఆదాయం ఆర్జిస్తున్నట్లు తెలుస్తోందని మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి సంపదను కాపాడాల్సిన అధికారులే లంచాలకు ఆశపడి మట్టి మాఫియా గుంపులతో చేతులు కలుపుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుకు కోట్లు గడిస్తున్నారు అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది అధికారులు రాజకీయ నాయకుల అండదండలతో ప్రభుత్వ ఆదాయానికి గండికోడుతూ ప్రకృతి సంపదను స్వాహా చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."రెవెన్యూ,ఇరిగేషన్ శాఖలకు ఈ అక్రమ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం లేదని చెప్పుకోవచ్చా?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వెనుక ఉన్న అసలు కారణాలపై కూడా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఘటనపై పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ జరిపి,అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై, అలాగే బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రకృతి సంపదను రక్షించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే - కేటీఆర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)**ఏభారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) రజతోత్సవ సభను విజయవంతం చేసిన తెలంగాణ ప్రజలకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. లక్షల మందిగా తరలివచ్చిన ప్రజలు, కేసీఆర్ నాయకత్వంపై అపారమైన విశ్వాసాన్ని మరోసారి చాటారని కేటీఆర్ అన్నారు. ఈ సభ విజయవంతం చేయడంలో కీలకపాత్ర వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కేటీఆర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. నిన్నటి సభ ద్వారా బిఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రాబోతుందని ప్రజలు స్పష్టమైన సందేశం ఇచ్చారన్నారు. దేశ రాజకీయ చరిత్రలో అతిపెద్ద బహిరంగ సభల్లో ఈ వరంగల్ రజతోత్సవ సభ నిలిచిపోతుందని కేటీఆర్ తెలిపారు. బిఆర్ఎస్ ప్రజాబలం మరోసారి రుజువైందన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులున్నా, ప్రజలు ముందుగానే సభ ప్రాంగణానికి చేరుకోవడం, సభ విజయవంతంగా సాగిపోవడం తెలంగాణ ప్రజల నిబద్ధతకు నిదర్శనమని కేటీఆర్ ప్రశంసించారు.

### ఇది ప్రారంభమే... ముందు చుక్కలు చూపిస్తాం

ఈ సభతో రజతోత్సవ కార్యక్రమాలను మొదలుపెట్టామనీ, కేసీఆర్ నేతృత్వంలో భవిష్యత్తులో మరిన్ని ప్రజా పోరాటాలు జరగనున్నాయని కేటీఆర్ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ అక్రమాలు, దోపిడీలను మరింత తీవ్రంగా ఎండగడతామని, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రభుత్వ వైఫల్యాలను సూటిగా వెలుగులోకి తీసుకువచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రభుత్వ అరాచకాలకు తోడు, కాంగ్రెస్ నాయకుల అవినీతిని ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కేటీఆర్ మాట్లాడారు. సభ విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. వరంగల్ జిల్లా నాయకులు, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యేతో పాటు కార్యకర్తల కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు. సభ ఏర్పాట్ల కోసం గత నెల రోజులుగా నిస్వార్థంగా శ్రమించిన నాయకులు, కార్యకర్తల సహాయంతో ఎలాంటి అవాంతరాలు లేకుండా సభ విజయవంతం అయిందని కేటీఆర్ తెలిపారు.

## కేటీఆర్‌కు గాయం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** కేటీఆర్ మళ్ళీ గాయపడ్డారు. జిమ్ వర్కౌట్లు చేస్తూ గాయపడినట్లు మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. నడుముకు గాయమైందని, డాక్టర్ల సూచనతో కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోనున్నట్లు ట్వీట్ చేశారు. త్వరలో కోలుకొని ప్రజల ముందుకు వస్తానని ఆయన తెలిపారు. ఆదివారం జరిగిన ఎల్కతుర్తి సభలో కేటీఆర్ పాల్గొన్నారు. సోమవారం నాడు జిమ్ లో వర్కవుట్ చేస్తుండగా గాయాలయ్యాయి. కేటీఆర్ గాయం నుంచి త్వరగా కోలుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులు కామెంట్లు పెడుతున్నాయి.

## డబ్బులు పెట్టు అక్రమ నిర్మాణాలు కట్టు

- సికింద్రాబాద్ సర్కిల్లో అక్రమ నిర్మాణాల జోరు
- లంచాలు తీసుకుని మౌనం వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఏసీపీ బాల శ్రీనివాస్
- జిహెచ్ఎంసి ఉన్నంత అధికారుల బాధ్యతారాహిత్యమే అవినీతికి మూలం
- అధికారులకు, సిబ్బందికి అక్రమ నిర్మాణాల ఆదాయం కోట్లలోనే
- అన్ని నోటీసులు ఇచ్చి కూల్చకుండా లంచాలతో మౌనం





సీతాఫలమండి (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల పరంపర కొనసాగుతుంది. టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతికి అంతం లేకుండా పోయింది పత్రికలో వచ్చిన కథనాలపై ఏసీపీ బాల శ్రీనివాస్ చర్యలు తీసుకోకుండా తనకు మామూళ్లు ఇవ్వని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏసీపి కనుసైగల్లో ఎక్కడ చూసిన అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని దీనితో జిహెచ్ఎంసి ఆదాయానికి భారీగా గండిపడుతోందని స్థానికులు మండిపడుతున్నారు. ఇన్చార్జి ఏసిపి గా బాల శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి తన అవినీతి సామ్రాజ్యం పెంచి పోషిస్తున్నారని ఇటు సికింద్రాబాద్ అటు మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని ఉన్నత అధికారులు నిర్లక్ష్యంతో ఏసీపీ అవినీతి దందా హాయిగా జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. జోనల్ కమిషనర్, జిహెచ్ఎంసి కమిషనర్ స్పందించకపోవడంతో వీళ్ళ అవినీతి అక్రమాలకు అంతులేకుండా పోయిందని ఇక తార్నాక, సీతాఫలమండి, బౌద్ధ నగర్, మెట్టుగూడ, అడ్డగుట్ట డివిజన్ లలో వందల భవనాలకు నోటీసులు ఇచ్చి కూడా కూల్చివేతలు చేయకుండా సెక్షన్ ఆఫీసర్ ఏసిపి, డిప్యూటీ కమిషనర్ కుమ్మక్కై భారీగా మామూళ్లు తీసుకొని అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని స్థానిక నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీతాఫలమండి డివిజన్ పరిధిలో పక్కింటి నెంబర్ 11%-3-%384/2/23 భారీ అక్రమ నిర్మాణం జరుగుతుంటే నోటీసులు ఇచ్చి చైన్ మెన్లు సెటిల్మెంట్లు చేసుకుంటూ కోట్లు గడిస్తున్నారని దీనిపై వెంటనే జోనల్ కమిషనర్ రవి కిరణ్ స్పందించి వెంటనే

### చైన్ మెన్ లా కనుసైగల్లో అక్రమ నిర్మాణాలు

సికింద్రాబాద్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ చైన్ మెన్ లు కోట్లు గడిస్తున్నారు. ఒక్కొక్క చైన్ మెన్ ఒక రోజుకు దాదాపు 50 వేల నుండి లక్ష రూపాయల వరకు లంచాలు తీసుకెళ్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు సెక్షన్ ఆఫీసర్, ఏసిపి, డిప్యూటీ కమిషనర్లు తమ వాటాలు పంచుకుంటున్నారని ఉన్నత అధికారులు కూడా ఇలా మామూళ్లకు అలవాటు పడడం వల్లనే అక్రమ నిర్మాణాలను కూల్చి వేయకుండా అందరూ కాపాడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా సికింద్రాబాద్ జోన్ పరిధిలో చైన్ మెన్లు భారీగా అవినీతికి పాల్పడుతూ అక్రమాలే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారని సాక్షాత్ జిహెచ్ఎంసి కమిషనర్ కు ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు చర్యలు తీసుకోకుండా జిహెచ్ఎంసి కమిషనర్ పూర్తి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని ఇప్పుడు కమిషనర్ ఇలంబర్తి మారడంతో పరిస్థితి మొదటికి వచ్చిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిహెచ్ఎంసిని ప్రక్షాళన చేయవలసిన జోనల్ కమీషనర్లు, జిహెచ్ఎంసి కమిషనర్ నిమ్మకు నీరు ఎత్తెనట్టు వ్యవహరిస్తున్నారని అందుకోసమే జిహెచ్ఎంసి అంటే అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## బీఆర్ఎస్ వల్లే దివాలా: ఉత్తమ్



**నల్లగొండ (ప్రశ్న న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అప్పుల ఊబిలో ముంచేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ దే అన్నారు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ చేసిన ఆరోపణలపై మండిపడ్డారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఓ ప్లాన్ ప్రకారం ముందుకు సాగుతోంది. అలాంటి తమ ప్రభుత్వంపై కేసీఆర్ ఆరోపణలు చేయడం అనాగరిక చర్యగా విమర్శించారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో అదనపు బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి. తర్వాత నర్సింగ్ బట్ల, దోమలపల్లి గ్రామాలలో రూ.46 కోట్ల వ్యయంతో నిర్మించిన ఎస్ఎల్బీసీ హై లెవెల్ ఎత్తిపోతల పథకాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.రాష్ట్ర ప్రజలు

ప్రజాప్రశ్న EFFECT

## కోడె క్యూ లైన్ల భవనంలో ఫ్యాన్లు వాడుక షురూ

- "ప్రజా ప్రశ్న దినపత్రిక" కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన పలువురు భక్తులు




**వేములవాడ(ప్రశ్న న్యూస్)** దక్షిణ కాశీగా పేరు గాంచిన ప్రముఖ ప్రసిద్ధ శైవక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలోని కోడె క్యూ లైన్ల భవనంలో శ్రీరామ నవమి వేడుకలు, వేసవికాలాన్ని పురస్కరించుకొని నూతన 12 ఫ్యాన్లను భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసి, ఆర్భాటంగా శ్రీరామ నవమి రోజున ప్రారంభించి, మరుసటి రోజు నుండి ఫ్యాన్ల వినియోగాన్ని నిలుపుదల చేయగా వేసవి కాలం దృష్ట్యా భక్తులు పిల్లా పాపలు,తీవ్ర ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతూ ఆలయ అధికారులపై తీవ్ర అసహనం, ఆగ్రహం చేసిన నేపథ్యంలో "ప్రజా ప్రశ్న దినపత్రిక"ప్రతినిధి భక్తుల ఆవేదనను ఆలయ అధికారుల దృష్టికి "ఆరంభ శూరులు. ఆలయ అధికారులు" అనే శీర్షికతో ఈనెల 22 న వెలుగులోకి తీసుకురాగా ఆలయ సంబంధిత అధికారులు స్పందించి సోమవారం 12 ఫ్యాన్లను వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు "ప్రజా ప్రశ్న దినపత్రిక" యాజమాన్యానికి,ఆలయ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588